

నంది పత్రిక

మా కలం - సామాన్యుడి బలం

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162



ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 296 | గురువారం 05 - నవంబర్ - 2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,

యాదవుల ఆత్మగౌరవానికి లోటు రానివ్వం..



- సదర్ సమ్మేళనం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పండుగ
- సదర్ నిర్వహణకు రూ.5 కోట్లు మంజూరు చేశాం
- యాదవులకు సముచిత స్థానం కల్పించాం : సీఎం రేవంత్ రెడ్డి

2లో

హైదరాబాద్, (నంది పత్రిక) యాదవ సోదరుల ఆత్మగౌరవానికి ఎక్కడా లోటు లేకుండా చూసే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సదర్ సమ్మేళనం యాదవులకే పరిమితం కాదని, తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. యాదవ సోదరులందరికీ సదర్ సమ్మేళన శుభాకాంక్షలు తెలిపారు.



భూములను అమ్మేస్తే సహించం

- 550 ఎకరాల భూములపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు..
- పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకు కేటాయించాలని డిమాండ్
- రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు.. ఏడాదిలోపే కేసీఆర్ తిరిగొస్తారని వ్యాఖ్య
- హైదర్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరిక

మిగతా2లో

హైదరాబాద్ (నంది పత్రిక) : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. మియాపూర్‌లోని 550 ఎకరాల భూముల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ.. వాటిని విక్రయించకుండా ప్రజా అవసరాలకు



తేజస్వి యాదవ్‌కు తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆతిథ్యం

హైదరాబాద్‌కు వచ్చిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలకు ఘన స్వాగతం

2లో

రాష్ట్ర, జాతీయ రాజకీయ పరిణామాలపై నేతల మధ్య చర్చలు

హైదరాబాద్, (నంది పత్రిక) హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఆర్జేడీ, సమాజ్ వాదీ పార్టీ నేతలకు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఘన స్వాగతం పలికారు. బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత తేజస్వి ప్రసాద్ యాదవ్, ఎంపీ సంజయ్ యాదవ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు ధరమ్‌పాల్ యాదవ్, అక్షయ్ యాదవ్‌లను తన నివాసానికి ఆహ్వానించారు.ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని తలసాని నివాసానికి చేరుకున్న నేతలకు ఆయనతో పాటు సికింద్రాబాద్

రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమక్షంలోనే సమగ్ర భూ సర్వే..
- వచ్చే ఏడాదిలోగా ప్రతి అంగుళం భూమి సర్వే చేయాలని లక్ష్యం
- క్షేత్రస్థాయి సమస్యలను అధికారుల సమక్షంలోనే పరిష్కరిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేపడుతోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



బస్సులో మహిళా ఎంపీ చెంపపై కొట్టిన కాంగ్రెస్ ఎంపీ..



ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో రాజకీయ దుమారం కాంగ్రెస్ తీరుపై కేంద్రమంత్రి అథవాలే, శివసేన నేత నిరుపమ్ విమర్శలు అది సరదా సంఘటన మాత్రమేనని స్పష్టం చేసిన మహిళా ద ఎంపీ ప్రతిభా ధనోర్కర్

2లో

రాజకీయ లబ్ధి కోసమే దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపణ

కరవు కష్టాల నుంచి రైతన్నను గట్టెక్కించండి



కరవు పరిస్థితులపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం

రాష్ట్రానికి ప్రత్యేక సాయం అందించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి

వీబీ జీ రామ్ జీ పథకం పనిదినాలు 200కి పెంచాలని కోరిన సీఎం

కరవు బాధితులకు డ్రాట్ కార్డులు, జేజేఎం విస్తరణకు సహకరించాలని వినతి

పంటల బీమా పరిహారం త్వరగా చెల్లించేలా చూడాలని సూచన

ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ రంగం కుదేలైన నేపథ్యంలో, రైతులను, ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో కరవు తీవ్రతను అంచనా వేసేందుకు పర్యటించిన కేంద్ర అంతర మంత్రిత్వ శాఖల బృందం (ఐఎంసీటీ) బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం చేపడుతున్న ఉపశమన చర్యలను సీఎం వారికి సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను కేంద్ర బృందానికి వివరిస్తూ, "ఒకవైపు తీరప్రాంతం తుఫాన్లతో నష్టపోతుంటే, మరోవైపు రాయలసీమ, ఇతర ప్రాంతాలు ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరవు కోరల్లో చిక్కుకున్నాయి" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది సాధారణం కంటే అత్యంత తక్కువ వర్షపాతం నమోదు కావడం వల్ల

మహిళా కండక్టర్ మృతితో ఆర్టీసీ అలర్ట్!



2లో



బస్సు డోర్లు మూశాకే కదలాలి..

రాష్ట్రవ్యాప్తంగా కొత్త మార్గదర్శకాలు

ప్రవళిక కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం.. ప్రభుత్వ ఉద్యోగం

మణుగూరు, విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి



పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి

పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని, ఈ విషయం ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాలతో మరోసారి బహిర్గతమైందని ఆమె విమర్శించారు. ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో రాష్ట్ర అధికారులు గోదావరి - కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ నుంచి చేపట్టాలని కోరుతుంటే... మరోవైపు కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కవిత ఆరోపించారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని, 2024లోనే తెలంగాణ జాగృతి తరఫున తాము దీనిని వ్యతిరేకించామని గుర్తుచేశారు.

ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి మద్యం వాసన వచ్చేది: రాహుల్ గాంధీ

భగవంత్ మాన్‌పై రాహుల్ గాంధీ తీవ్ర వ్యక్తిగత విమర్శలు

రోజూ మద్యం సేవించే సీఎం డ్రగ్స్‌పై పోరాడలేరని వ్యాఖ్య

పంజాబ్ పాలన కేజ్రీవాల్, అమిత్ షా చేతుల్లో ఉందని ఆరోపణ



పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో వ్యక్తిగత విమర్శలు చేశారు. ఆయనకు మద్యపానం సేవించే అలవాటు ఉందని, అలాంటి వ్యక్తి రాష్ట్రంలో మాదకద్రవ్యాల సమస్యను ఎలా పరిష్కరించగలరని ప్రశ్నించారు. సంగ్రూర్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'ఇన్సాఫ్ ర్యాలీ'లో పాల్గొన్న

ఏసీబీ వలకు చిక్కిన బజార్‌హత్నూర్ ఎస్సై!



రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే

రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వారి సమక్షంలోనే భూముల రీసర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి, భూ యజమానులకు వివాదరహిత భూముల రికార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రీసర్వే జరిగే గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని మంత్రి సూచించారు. ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, కనీసం వారానికి ఒకరోజైనా సర్వే జరుగుతున్న గ్రామాలను సందర్శించాలని ఆదేశించారు. భూమి కలిగిన ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో భద్రతతో కూడిన భూ రికార్డులు, పాస్‌బుక్కులు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.

125 ఏళ్ల తర్వాత భారీ స్థాయిలో సర్వే బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన భూ సర్వే, రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, హౌసింగ్ అంశాలపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డి. శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుమారు 125 ఏళ్ల క్రితం జరిగిన సర్వే తర్వాత రాష్ట్రంలో మరోసారి ఇంత విస్తృత స్థాయిలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నట్లు వివరించారు. తొలివిడతలో ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో సర్వేను వేగంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. గతంలో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించామని, ప్రస్తుతం నేరుగా జిల్లాలకు వచ్చి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బందితో సమస్యలను చర్చిస్తున్నామని చెప్పారు.

క్షేత్రస్థాయి సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం మండల స్థాయి అధికారుల జాబితా నుంచి యాదృచ్ఛికంగా అధికారులను ఎంపిక చేసి, ఆయా మండలాల్లో సర్వేకు సంబంధించిన అంశాలు, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల అభ్యంతరాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై నేరుగా చర్చిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అధికారులు సమస్యలను దాచకుండా వాస్తవ పరిస్థితులను వివరించాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వ స్థాయిలో అవసరమైన అనుమతులు, మార్గదర్శకాలు కల్పించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిజాయితీగా పనిచేసే అధికారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఉద్దేశపూర్వకంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూ హద్దుల వివాదాలకు చెక్ సమగ్ర భూ సర్వే కేవలం భూముల కొలతలకే పరిమితం కాదని మంత్రి పేర్కొన్నారు. సర్వే నంబర్లు ఒకచోట ఉండటం, భూముల వాస్తవ స్వాధీన స్థితి మరోచోట ఉండటం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, పట్టా భూముల సమస్యలు, భూముల హద్దులకు సంబంధించిన వివాదాలను గుర్తించి పరిష్కరించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు.

22-ఏ సమస్యల పరిష్కారానికి ఆదేశాలు 22-ఏ భూములకు సంబంధించి ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, మెమోల పరిధిలోకి రాని సమస్యలు ఏమైనా ఉన్నాయో పరిశీలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాంటి సమస్యలను గుర్తించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న సమగ్ర భూ సర్వే విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి, అరికపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, ఈర్లపల్లి శంకర్, మర్రి రాజశేఖరరెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భూములను అమ్మేస్తే సహించం

వినియోగించాలని డిమాండ్ చేశారు.

'భూములు అమ్మే బ్రోకర్‌ను సీఎం చేస్తే ఇలాగే ఉంటుంది'

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అడవులను నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేస్తే ఎలా ఉంటుందో.. భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే అలా ఉంటుందని విమర్శించారు. మియాపూర్ భూముల వ్యవహారంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కబ్జా ప్రయత్నాలు జరిగినప్పుడు, వాటిని కాపాడేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రముఖ న్యాయవాది వైద్యనాథన్‌ను నియమించి న్యాయపోరాటం చేసిందని తెలిపారు. 550 ఎకరాల భూముల పరిరక్షణ కోసం తమ ప్రభుత్వం కోర్టులో వాదనలు వినిపించిందని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు రాగానే విక్రయ ప్రకటన!

మియాపూర్ భూములపై ఇటీవల సుప్రీంకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించి భూములను విక్రయించే ప్రతిపాదనను ప్రకటించారని విమర్శించారు. ప్రభుత్వానికి దక్కిన విలువైన భూములను అమ్మడం కంటే ప్రజల అవసరాలకు వినియోగించాలన్నారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ నగరంలో ఒక్క నిర్మాణమైనా చేపట్టారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షలాది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించామని గుర్తుచేశారు.

పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకే కేటాయించాలి

మియాపూర్‌లో ప్రభుత్వానికి దక్కిన 550 ఎకరాల భూములను ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించాలని కేటీఆర్ సూచించారు. అందులో 200 ఎకరాలను పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించాలని కోరారు. మరో 100 ఎకరాలను అమరవీరులకు, ఇంకో 100 ఎకరాలను తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలని ప్రతిపాదించారు. మిగిలిన భూముల్లో పిల్లల కోసం పాఠశాలలు, కళాశాలలు నిర్మించాలని సూచించారు. ఈ విధంగా భూములను ప్రజలకు ఉపయోగపడేలా వినియోగిస్తే తాము స్వాగతిస్తామని చెప్పారు.

'భూదందాలకు చెక్ పెడతాం' హెచ్ఐఎల్‌టీపీ భూముల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ కేటీఆర్ పారిశ్రామికవేత్తలకు హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వం ఇచ్చే ప్రలోభాలకు ఆశపడి ఎవరైనా ఆ భూములను కొనుగోలు చేస్తే, భవిష్యత్తులో వాటిని అనుభవించాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, ప్రస్తుతం జరుగుతున్న భూదందాలన్నింటికీ అడ్డుకట్ట వేస్తామని అన్నారు. ఏడాదిలోపే కేసీఆర్ తిరిగి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. మియాపూర్ భూముల విక్రయంపై ప్రభుత్వం చేసిన ప్రకటనకు సంబంధించి తుది నిర్ణయం ఇంకా మంత్రివర్గ పరిశీలనకు వెళ్లాల్సి ఉందని వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆ భూములను విక్రయించకుండా ప్రజా అవసరాలకు కేటాయించాలన్న కేటీఆర్ డిమాండ్ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

మహిళా కండక్టర్ మృతితో ఆర్టీసీ అలర్ట్ !

చెందిన మణుగూరు డిపో మహిళా కండక్టర్ ప్రవళిక ఘటనతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) అప్రమత్తమైంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. బస్సు తలుపులు పూర్తిగా మూసిన తర్వాతే బస్సు కదలాలని డ్రైవర్లను ఆదేశించింది. ఇదిలా ఉండగా, తీవ్ర విషాదంలోనూ ప్రవళిక కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

డోర్లు మూశాకే బస్సు ముందుకు.. కండక్టర్ మృతి నేపథ్యంలో ప్రయాణికులు, సిబ్బంది భద్రతకు సంబంధించి ఆర్టీసీ యాజమాన్యం కీలక చర్యలు చేపట్టింది. బస్సు తలుపులు పూర్తిగా మూసిన తర్వాతే వాహనాన్ని ముందుకు నడపాలని డ్రైవర్లు, కండక్టర్లకు స్పష్టం చేసింది. అన్ని డిపోల్లో బస్సుల తలుపులు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో నిరంతరం తనిఖీ చేయాలని డిప్యూటీ రీజినల్ మేనేజర్లను ఆదేశించింది. సంస్థ సొంత బస్సులతో పాటు అద్దె బస్సులు, ఎలక్ట్రిక్ బస్సుల్లోనూ డోర్ల పనితీరును నిశితంగా పరిశీలించాలని సూచించింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రతకు సంబంధించిన నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నిర్ణయించింది. ప్రవళిక మృతి పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అంతేకాకుండా ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

విషాదంలోనూ నేత్రదానం..

కుటుంబ సభ్యురాలిని కోల్పోయిన బాధలోనూ ప్రవళిక కుటుంబం గొప్ప నిర్ణయం తీసుకుంది. పోస్టుమార్టం అనంతరం ఆమె నేత్రాలను దానం చేసేందుకు ముందుకొచ్చింది. దీంతో ఆమె కార్నియాలు ఇద్దరికి చూపునిచ్చేందుకు ఉపయోగపడనున్నాయి. ప్రవళిక మరణించినా.. మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపనుంది.

చిల్లర వివాదంతో విషాదం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద గత నెల 25న ఈ ఘటన చోటుచేసుకుంది. మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ ప్రవళిక విధులు నిర్వహిస్తుండగా చిల్లర విషయంలో ప్రయాణికురాలితో వివాదం జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో ప్రయాణికురాలు ఆమెను కదులుతున్న బస్సు నుంచి కిందకు నెట్టివేసినట్లు కథనాలు వెలువడ్డాయి. దీంతో కిందపడిన ప్రవళిక బస్సు చక్రాల కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో ఆమె రెండు కాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తొలుత స్థానికంగా చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆస్పత్రికి వెళ్లి ప్రవళికను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆమె కోలుకుంటుందని కుటుంబ సభ్యులు, సహచరులు ఆశించినప్పటికీ వైద్యుల ప్రయత్నాలు ఫలించలేదు. చికిత్స పొందుతూ మంగళవారం ఆమె తుదిశ్వాస విడిచారు. **బుధవారం మణుగూరు డిపో బంద్‌కు పిలుపు** ప్రవళిక మృతికి కారణమైన ప్రయాణికురాలిపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం మణుగూరు డిపో బంద్‌కు పిలుపునిచ్చింది. కండక్టర్ మృతి పట్ల ఆర్టీసీ సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి మద్యం వాసన వచ్చేది: రాహుల్ గాంధీ

రాహుల్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో తాను, భగవంత్ మాన్ లోక్‌సభ సభ్యులుగా ఉన్నప్పటి సంఘటనను రాహుల్ గుర్తు చేసుకున్నారు. "ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి మద్యం వాసన వచ్చేది" అని సంచలన ఆరోపణ చేశారు. మద్యం సేవించడం ఆయన వ్యక్తిగత విషయం కావొచ్చని, కానీ ప్రతిరోజూ మత్తులో ఉండే ముఖ్యమంత్రి మాదకద్రవ్యాల వల్ల కలిగే బాధను ఎలా అర్థం చేసుకోగలరని నిలదీశారు. పంజాబ్‌కు డ్రగ్స్ సమస్యపై నిజంగా బాధపడే నాయకుడు అవసరమని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం పంజాబ్‌ను పాలించడం లేదని, రాష్ట్రాన్ని ఢిల్లీ నుంచి నడిపిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. "పంజాబ్ పాలనను సగం అరవింద్ కేజ్రీవాల్, మరో సగం కేంద్ర హోంమంత్రి అమిత్ షా నడుపుతున్నారు. భగవంత్ మాన్ కేవలం అక్కడ కూర్చుంటున్నారు అంతే" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పంజాబ్ నుంచే పాలన అందిస్తామని స్పష్టం చేశారు. మూడేళ్లలో డ్రగ్స్‌ను అంతం చేస్తానన్న అమిత్ షా వ్యాఖ్యలను కొట్టిపారేసిన రాహుల్, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అంతకాలం కొనసాగకపోవచ్చని అన్నారు. గతంలో పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య పెరిగిపోతోందని తాను హెచ్చరించినప్పుడు బీజేపీ, అకాలీదళ్ తన మాటలను పట్టించుకోలేదని రాహుల్ గుర్తుచేశారు. రాష్ట్రంలో డ్రగ్స్, గ్యాంగ్‌స్టర్ సంస్కృతిని నిర్మూలించాలంటే పరిశ్రమలు, ఫ్యాక్టరీలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్ గాంధీ మరోసారి సవాల్ విసిరారు. మోదీతో ముఖాముఖి చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, కేవలం ఐదు నిమిషాల్లోనే మోదీ ఒక "దేశద్రోహి" అని, ఆయన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతిలో కీలుబొమ్మ అని నిరూపించగలనని అన్నారు.ద

ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం: ఎస్ఈసీ పునేఠా

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పోలింగ్‌కు పెద్దగా ఇబ్బందులు ఉండబోవని ఆయన తెలిపారు. బుధవారం విజయవాడలో జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరపాలని, ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఓటర్లకు, సిబ్బందికి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ, పోలింగ్ విధుల్లో 2.52 లక్షల మంది, కౌంటింగ్‌లో 52 వేల మంది సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. పశ్చిమ గోదావరి, గుంటూరు, బాపట్ల జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పరిస్థితులను బట్టి పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీకి అనుమతిస్తామని, ప్రిసైడింగ్ అధికారులు తప్పనిసరిగా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

ఏసీబీ వలకు చిక్కిన బజార్‌హత్నూర్ ఎస్సై!

రూ. 40 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత

ప్రమాద కేసు నుంచి తప్పించేందుకు బాధితుడి నుంచి రూ.40 వేలు లంచం తీసుకుంటూ బజార్‌హత్నూర్ ఎస్సై రమేశ్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం మోర్ఖండి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి యాక్సిడెంట్ కేసులో ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఎస్సై రూ.40 వేలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ మధు ఆధ్వర్యంలో అధికారులు బుధవారం మధ్యాహ్నం ట్రాప్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిసరాల్లో బాధితుడి నుంచి ఎస్సై డబ్బులు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని ఎస్సైని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. పోలీసు శాఖలో లంచం వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

విమానయాన రంగంలో కొత్త శకం.. 90 ఏళ్ల నాటి చట్టం రద్దు.. త్వరలో 'భారతీయ వాయుయాన్ నియమ్-2026'

దేశ పౌర విమానయాన రంగంలో చారిత్రక సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాదాపు 90 ఏళ్లుగా అమల్లో ఉన్న 1937 నాటి ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్ స్థానంలో "భారతీయ వాయుయాన్ నియమ్-2026" పేరుతో సమగ్రమైన కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. వేగంగా విస్తరిస్తున్న విమానయాన రంగాన్ని నియంత్రించేందుకు రూపొందించిన ఈ నిబంధనలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు బుధవారం నాడు ప్రభుత్వం అధికారికంగా వివరాలు వెల్లడించింది. ఈ కొత్త నిబంధనలలో పలు కీలక మార్పులు చేశారు. ముఖ్యంగా, విమానాల డిజైన్, సర్టిఫికేషన్ కోసం స్పష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీనివల్ల 'స్టేట్ ఆఫ్ డిజైన్'గా (విమానాలను డిజైన్ చేసే దేశం) భారత్ స్థానం మరింత బలోపేతం కానుంది. అలాగే, విమానాల విడిభాగాల తయారీకి కూడా అధికారం లభిస్తుంది. దీంతో పాటు ఒక విమానాన్ని పలువురు వ్యక్తులు కలిసి కొనుగోలు చేసేందుకు వీలు కల్పించే 'ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్' విధానాన్ని కూడా ప్రవేశపెట్టారు. విమానాల లీజింగ్ ప్రక్రియను సులభతరం చేసే ఐడీఈఆర్ఏ (ఇర్రివోకబుల్ డీ-రిజిస్ట్రేషన్ అండ్ ఎక్స్‌పోర్ట్ రిక్వెస్ట్ ఆథరైజేషన్) విధానం ప్రకారం విమానాల కొనుగోలు, లీజింగ్ ఖర్చులు తగ్గి భవిష్యత్తులో విమాన ఛార్జీలు కూడా తగ్గే అవకాశం ఉంది. కొత్త రూల్స్ ద్వారా విమానయాన సంస్థల వాణిజ్య సౌలభ్యం, ప్రయాణికుల ప్రయోజనాల మధ్య సమతుల్యత సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విమాన ఛార్జీలు, ఇతర రుసుములలో మరింత పారదర్శకతను తీసుకురానున్నారు. అసాధారణ పరిస్థితులు తలెత్తినప్పుడు కేంద్ర ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు ఈ నిబంధనలు అధికారం కల్పిస్తున్నాయి.

యాదవుల ఆత్మగౌరవానికి లోటు రానివ్వం..

సదర్ సమ్మేళన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవ సోదరుల సహకారం ఎంతో ఉందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారిని యాదవులు ఆదరించి, అక్కున చేర్చుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం గోల్కొండ కోటగా పిలుస్తున్న ప్రాంతం ఒకప్పుడు గొల్లంకొండగా ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు.

సదర్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించాం గతంలో ఏ ముఖ్యమంత్రీ సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలనే ఆలోచన చేయలేదని సీఎం అన్నారు. యాదవుల ఆకాంక్షలను గుర్తించి తమ ప్రభుత్వం సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించిందని తెలిపారు. వేడుకల నిర్వహణ కోసం రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణలో కులగణన నిర్వహించి దేశానికి ఆదర్శంగా నిలిచామని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ నమూనాను దేశంలోని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా కులగణన చేపట్టామని పేర్కొన్నారు.

యాదవులకు సముచిత స్థానం తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించామని ముఖ్యమంత్రి తెలిపారు. అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని చెప్పారు. ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలిగా నియమించినట్లు గుర్తుచేశారు. యాదగిరిగుట్ట గోశాలలో గోవుల సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో యాదవులకు దక్కాల్సిన వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తెలంగాణ అభివృద్ధికి సహకరించాలి దేశంలో తెలంగాణను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి అన్నారు. మూసీ అభివృద్ధి, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి వంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు యాదవ సోదరులు సహకరించాలని సీఎం కోరారు. యాదవుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారికి తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

బస్సులో మహిళా ఎంపీ చెంపపై కొట్టిన కాంగ్రెస్ ఎంపీ..

కాంగ్రెస్ ఎంపీ శ్యామ్‌కుమార్ బర్వే.. తన సహచర మహిళా ఎంపీ ప్రతిభా ధనోర్కర్‌ను చెంపదెబ్బ కొడుతున్నట్లుగా ఉన్న ఒక వీడియో దుమారం రేపుతోంది. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన ఇండియా కూటమి ర్యాలీకి బస్సులో వెళుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దీనిపై తీవ్ర రాజకీయ దుమారం చెలరేగింది. కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే, శివసేన నేత సంజయ్ నిరుపమ్ ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. అయితే, ఈ వివాదంపై ఎంపీ ప్రతిభా ధనోర్కర్ స్పందించారు. తన సోదరుడి లాంటి సహచర ఎంపీతో చాలా తేలికగా, సరదాగా జరిగిన సంభాషణను వక్రీకరించి రాజకీయ ప్రయోజనాల కోసం వైరల్ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. "నా ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకే ప్రత్యర్థులు ఈ ఘటనను వాడుకుంటున్నారు. దివంగత మాజీ ఎంపీ బాలుభౌ ధనోర్కర్ వారసురాలిని, ఆడపులిని నేను. ఇలాంటి దుష్ప్రచారాలకు భయపడను, మరింత ధైర్యంగా నిలబడతాను" అని ఆమె సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే తీవ్రంగా స్పందించారు. ఒక మహిళపై చేయి చేసుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. "కాంగ్రెస్ పార్టీ మహిళలను గౌరవించాలి. కానీ వారి చర్యలు అలా కనిపించడం లేదు. మహిళపై చేయి ఎత్తడం తప్పు. ఆ ఎంపీ వెంటనే క్షమాపణ చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు. శివసేన నేత సంజయ్ నిరుపమ్ కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ వీడియో చాలా అభ్యంతరకరంగా ఉందని, ఇది చూశాక కాంగ్రెస్ నేతలు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. "ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలంటూ ర్యాలీకి వెళుతూ.. ఒక మహిళా ప్రజాప్రతినిధి గౌరవానికి భంగం కలిగించడం సిగ్గుచేటు" అని అన్నారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతానికి చెందిన బర్వే, ధనోర్కర్ ఇద్దరూ కాంగ్రెస్ ఎంపీలు. తన భర్త, మాజీ ఎంపీ బాలుభౌ ధనోర్కర్ మరణం తర్వాత ప్రతిభ చంద్రపూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఈ వీడియో చుట్టూ రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి.

పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి

"రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు 'గురుదక్షిణ'గా చెల్లించుకుంటున్నారు" అని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని కవిత హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం జరిపే అన్ని సంప్రదింపుల నుంచి తెలంగాణ తక్షణమే వైదొలగాలని, ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వెంటనే లేఖ రాయాలని ఆమె డిమాండ్ చేశారు.

తేజస్వి యాదవ్‌కు తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆతిథ్యం

పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. అతిథులకు స్నాక్స్, టీ అందించి ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జాతీయ రాజకీయాలు, తాజా పరిణామాలపై నేతలు చర్చించుకున్నారు. అనంతరం తలసాని కుటుంబ సభ్యులు ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ నేతలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన యాదవ సంఘాల నాయకులను కూడా ఎమ్మెల్యే తలసాని వారికి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, నోముల భగత్, శ్రీకృష్ణ ట్రస్ట్ అధ్యక్షుడు చింతల రవీందర్ యాదవ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, ఎడ్ల హరిబాబు యాదవ్, మహేష్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, తలసాని ధరమ్ యాదవ్, కొండాపురం మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

కరవు కష్టాల నుంచి రైతన్నను గట్టెక్కించండి:

ఖరీఫ్ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని, సాగునీటితో పాటు తాగునీరు, పశుగ్రాసానికి కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన ప్రాంతంగా అనంతపురం జిల్లా నిలిచిన విషయాన్ని ఆయన బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 412 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించామని, పంట నష్టాలపై పూర్తిస్థాయి అంచనాలతో వారం రోజుల్లో కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

వ్యవసాయానికి అండగా కీలక పథకాల విస్తరణ కరవు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ఉపాధిని, వ్యవసాయాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కొన్ని కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి క్షేత్రస్థాయిలో మానవ వనరుల అవసరం ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో 'వీబీ జీ రామ్ జీ' పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచాలని కోరారు. ఈ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానించడం ద్వారా రైతులకు కూలీల కొరత తీరడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సూచించారు. కరవు కారణంగా రైతుల ఆదాయం పూర్తిగా పడిపోయిందని, గతంలో తీవ్ర కరవు వచ్చినప్పుడు రాయలసీమలో పది ఎకరాల రైతులకు కూడా రేషన్ కార్డులు ఇచ్చి ఆదుకున్నామని గుర్తుచేశారు. అదే తరహాలో ప్రస్తుతం అర్హులైన కరవు బాధిత కుటుంబాలకు 'డ్రాట్ కార్డులు' జారీ చేసే అంశాన్ని పరిశీలించి, కేంద్ర సహకారంతో నిత్యావసరాలను సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు, రైతుల వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు కేంద్రం తోడ్పాటునందించాలని కోరారు.

జల్ జీవన్ మిషన్‌తో శాశ్వత పరిష్కారం వర్షాభావంతో భూగర్భ జలమట్టాలు ప్రమాదకరంగా పడిపోయాయని, కొత్తగా ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడటం లేదని ముఖ్యమంత్రి తెలిపారు. కేవలం తాత్కాలిక నీటి సరఫరా చర్యలతో సరిపెట్టకుండా, శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఇందుకోసం 'జల్ జీవన్ మిషన్' (జేజేఎం) పథకాన్ని మరింత విస్తరించి, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, అనుసంధానం వంటి పనులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా పరిహారాన్ని త్వరగా అందించడం అత్యవసరమని అన్నారు. బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా, వీలైనంత త్వరగా పరిహారం రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది రైతులకు తదుపరి పంటకు పెట్టుబడిగా ఉపయోగపడుతుందని వివరించారు. ఈనెల 2, 3 తేదీల్లో కేంద్ర బృందం రెండు టీమ్‌లుగా విడిపోయి కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించింది.

బండి ఆత్మకూరు మండలంలో భారీగా పోలీసు బందోబస్తు



బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 4 బండి ఆత్మకూరు మండలంలో గురు వారం జరగనున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ సుస్మితా రంగనాథన్ ఉత్తర్వుల మేరకు, గ్రామాలలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు 52 మంది సాధారణ పోలీసులు 20 మంది హోంగార్డులు 18 మంది మహిళా పోలీసులు, ఎన్నికల బందోబస్తులో విధులను నిర్వహించనున్నారు. వీరితోపాటు , ఎన్సీపీ స్టూడెంట్లు, ఫారెస్ట్ సిబ్బంది తో పాటు, పదవీ విరమణ పొందిన 47 మంది ఉద్యోగస్తుల సేవలను కూడా వినియోగించుకోనున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ముగ్గురు సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ముగ్గురు ఎస్ఐలు ఎన్నికలను పర్యవేక్షించనున్నారు. గ్రామాలలో ఎన్నికలు ప్రశాంతంగా జరగకుండా గొడవలు సృష్టించే వ్యక్తులను గుర్తించి అటువంటి వారిపై మండలంలో 300కు పైగా బైండోవర్ కేసులను నమోదు చేశారు. మండలంలో సంత జూటూరు ఈర్లపాడు, భోజనం, కడమల కాల్వ, లింగాపురం, సింగవరం గ్రామాలను సమస్యాతక గ్రామాలుగా గుర్తించారు. ఈ గ్రామాలలో ప్రత్యేకంగా అదనపు బలగాలను ఏర్పాటు చేసే పనులకు పోలీసు శాఖ పూనుకొంటూ ఉంది. ఎన్నికల బందోబస్తులో పాల్గొనడానికి వచ్చిన పోలీసులు ఫారెస్టు సిబ్బంది, ఎన్ సి డి స్టూడెంట్ లతో ఎస్ఐ జగన్మోహన్ బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి గ్రామాలలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా, సిబ్బంది సమయస్ఫూర్తితో ఓర్పుతో విధులు నిర్వహించాలని వారికి సూచనలు చేశారు. గ్రామాలలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీల వారు పూర్తిగా సహకరించాలని పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తూ ఉంది. పోలింగ్ బూతుల వద్ద, ఇతర ప్రదేశాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులు గుంపులుగా తిరగడం నిషిద్ధం. ఏ ఎస్ పి సుస్మిత రంగనాథన్ పర్యవేక్షణలో ఈ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. సాధారణ పౌరులకు భద్రత కల్పించి వారు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు.

సుస్థిర జీవనశైలిపై విద్యార్థులకు అవగాహన

కలసపాడులో అటవీశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం.. విద్యార్థులతో ప్రతిజ్ఞ

కలసపాడు, నవంబర్ 4 (నంది పత్రిక):దేశంలో ప్రస్తుతం ఎల్ – నీనో ప్రభావం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సుస్థిర జీవనశైలి వారోత్సవాలు2026లో భాగంగా నాల్గవ రోజు కలసపాడు పట్టణంలోని ఎస్కే ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కడప జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) బాలరాజు ఐఎఫ్ఎస్ ఆదేశాల మేరకు పోరుమామిళ్ల అటవీ రేంజ్ అధికారి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతతో పాటు సుస్థిరమైన ఆహారపు అలవాట్లు, ఆహార వృథాను నివారించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో అటవీశాఖ అధికారులు సుస్థిర జీవనశైలి ప్రతిజ్ఞ చేయించారు. ప్రకృతి వనరులను సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్కే విద్యాసంస్థల ముఖ్య పరిపాలనాధికారి (సీఏఓ) షేక్ ఖాద్రి, పరిపాలనాధికారి (ఏఓ) వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పాఠశాలప్రధానోపాధ్యాయుడు భాష, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే అటవీశాఖ తరపున సెక్షన్ అధికారి రమణయ్య, బీట్ అధికారులు రత్న, సుభాషిణి, హోసన్ భాష, కరుణాకర్ పాల్గొన్నారు.



బాల్య వివాహాలను అరికట్టాలి.

బాల్య వివాహ ముక్త్ భారత్

-జిల్లా బాలల సంరక్షణ విభాగం - సంరక్షణ అధికారి

-కె.శ్రీనివాస్ మరియు డోన్ ఐసీడిఎస్ సిడీపీఓ శంషాద్ బేగం.



బేతంచెర్లనవంబర్4(నందిపత్రిక).ప్రస్తుత సమాజంలో బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మన అందరి మీద కలదని జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి కె.శ్రీనివాస్, డోన్ సిడిపిఓ శంషాద్ బేగం అన్నారు. బేతంచెర్ల మండల కేంద్రంలోని బనగానపల్లె రహదారిలో గల కస్తూరిబా హై స్కూల్ నందు, మంగళవారం బాల్య వివాహ ముక్తభారత్ పంద రోజులు అవగాహన కార్యక్రమం కస్తూర్బా ప్రిన్సిపల్ అమీదా బేగం,సూపర్వైజర్ రాధమ్మ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బాలల సంరక్షణ వివాదం జిల్లా అధికారి కె.శ్రీనివాస్, డోంట్ ఐసిడిఎస్ సిడిపిఓ శంషాద్ బేగం మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లీలావతి ఆదేశాల మేరకు,బాల్య వివాహాల ను ప్రోత్సహించడం చేయడం నేరమని వారన్నారు.బాలల హక్కుల 1.జీవించడం 2.రక్షణ 3. అభివృద్ధి 4.భాగస్వామ్య హక్కుల గురించి బాలికలకు వివరించారు.అలాగే ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతుందని తెలిసిన చూసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి ,పోలీస్ హెల్ప్ లైన్100 కు,ఉమెన్ హెల్ప్ లైన్181నంబర్లకు కాల్ చేసి చెప్పవచ్చుఅని అన్నారు. చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుంది అని తెలిపారు. ప్రస్తుతం బాలికలు సమాజం ఎదుర్కుంటున్న సమస్యలను ఎలా ఎదుర్కోవాలి అని వివరించారు.అలాగే బాల్య వివాహాల నిర్మూలన గురించి, విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒశంషాద్ బేగం మాట్లాడుతూ బాలికలు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా బాగా చదివి,ఉన్నత స్థాయి ఉద్యోగులుగా కావాలని తెలిపారు.ఏదైనా సమస్య వస్తే ధైర్యంగాఎదుర్కునే సామర్థ్యం మీలో ఉండాలని, ప్రతి విషయము తల్లి తండ్రులకు చెప్పాలని ,బాలికలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని ఒక్క చదువు ద్వారానే సమాజం లో బాలికల గౌరవం పెరుగుతుందని,మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. అలాగే పిల్లలకు పౌష్టిక ఆహారం వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధమ్మ మాట్లాడుతూ అపరిచితుల పట్ల చాలా జాగ్రత్తగాఉండాలని ఎవరిని అంతత్వరగా నమ్మకూడదని, మిమ్మల్ని ఎవరైనా ఇబ్బంది పెడితే తల్లితండ్రులకు లేదా టీచర్లకు చెప్పాలని తెలిపారు. మరియు వ్యక్తి గత పరిశుభ్రత గురించి తెలిపారు. ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ మరియు అంగన్వాడీ టీచర్స్ రాధాదేవి,రాజేశ్వరి,మేరీ.అలాగే పాఠశాల సువర్ణ, మహేశ్వరి మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల మున్సిపల్ చైర్మెన్ పీఠం తెలుగుదేశం పార్టీ సాధించింది.

30 ఏళ్ల టీడీపీ కళ నెరవేరింది.

మున్సిపల్ చైర్మెన్ గా డాక్టర్ బాబన్ విజయం.

కూటమి ప్రభుత్వానికి షాక్ ఇచ్చిన వైసిపి.

52 వార్డుల్లో వైసిపి 27..టీడీపీ 24.బిజెపి1 స్థానంలో గెలుపు.

నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 4 (నంది పత్రిక))

నంద్యాల మున్సిపల్ చైర్మెన్ పీఠం దక్కించుకోవడానికి తెలుగుదేశం పార్టీ కన్న కలలు 30 ఏళ్ల తర్వాత తీరింది.నంద్యాల మున్సిపల్ చైర్మెన్ పీఠాన్ని సాధించింది.కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా వైసిపి గట్టి పోటీ ఇచ్చి ప్రభుత్వానికి షాక్ ఇచ్చింది.మున్సిపల్ ఎన్నికల్లో రాజీలేని పోరాటం సాగించి అధికార పార్టీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో వైసిపి,కూటమి అభ్యర్థులు ఏకగ్రీవాలు అయినా ఒక్క ఏకగ్రీవం కాకుండా రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి ఒత్తిళ్లకు తలొగ్గక సై,అంటే సై అంటూ తమ అభ్యర్థులకు భరోసా కల్పించి,వారి విజయానికి కృషి చేసి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటించి కౌంటింగ్ వరకు అభ్యర్థులకు అండగా నిలిచి కూటమి కి షాక్ ఇచ్చే విధంగా తమ అభ్యర్థులను గెలిపించుకోవడం విశేషం.హోరా,హీరోగా జరిగిన ప్రచారాలు కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను ప్రజలోకి తీసుకొని వెళ్లడం లో సక్సెస్ సాధించారు.మున్సిపల్ ఎన్నికల్లో కూటమి కంటే వైసిపి అభ్యర్థులు అధికంగా గెలుపొందారు.ఈ ఎన్నికల్లో వైసిపి 27 స్థానాలు సాధించగా టీడీపీ 24 బీజేపీ 1 స్థానానికే పరిమితం అయింది.జనసేన బోణీ చేయలేదు.జనసేనకు లోకల్ నాయకుల మద్దతు కరవైంది.జన సేన పోటీ చేసిన స్థానాల్లో సైతం రెబల్ అభ్యర్థులు పోటీలో ఉండడంతో జన సేన బోణీ కొట్టలేదు.వివరాల్లోకి వితే రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలపై ప్రజలు భారీ అంచనాలు వేసుకున్నారు.రాష్ట్రంలోని 123 కార్పొరేషన్,మున్సిపాలిటీలో తమ అభ్యర్థులను కూటమి,వైసిపి నాయకులు గెలిపించుకోవాలని నేతలకు దిశా నిర్దేశం చేశారు.ఎన్నికలు సమీపిస్తుండటంతో అభ్యర్థులు ప్రకటన అనంతరం ఊహించని విధంగా అన్ని ప్రాంతాల్లో ఏకగ్రీవాలు జరిగాయి.కొన్ని ప్రాంతాలు మాత్రం భరణి నిలిచారు.ఈ నేపథ్యంలో నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో 52 వార్డుల్లో కూటమి,వైసిపి అభ్యర్థులు ఏకగ్రీవాలు లేకుండా బరిలోకి దిగాయి.చెదురు మదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.ఇంత వరకు బాగుంది రాష్ట్రంలో పోలింగ్ జరిగిన ప్రాంతాల్లో మధ్యాహ్నం లోపు అన్ని పలితాలు వెలువడ్డాయి.నంద్యాలలో కౌంటింగ్ ఉదయం 8 గంటలకు మొదలు పెట్టారు.అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనపడింది.పోస్టల్ బ్యాలెట్ ప్రకటన మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రకటించారు.మీడియా ను సైతం కౌంటింగ్ హాల్ లోకి వెళ్లకుండా అడుగడుగున ఆంక్షలు విధించారు.మీడియా ప్రశ్నించేసరికి కొందరికి మాత్రమే అనుమతి ఇచ్చారు.ఇక అప్పటి నుంచి రాత్రి పోతుంది తెల్లవారి 3 గంటల కు పలితాలు పూర్తి చేశారు.అధికారుల నిర్లక్ష్యానికి అభ్యర్థులు,ప్రజలు,కార్యకర్తలు,అభిమానులు అసహనం వ్యక్తంచేశారు.కొందరు అధికారులను శాపనార్థాలు పెట్టారు.ఉత్కంఠతతో సాగిన కౌంటింగ్ లో చివరి వరకు చైర్మెన్ పీఠం కోసం పోరాడిన వైసిపి చైర్మెన్ అభ్యర్థి దాల్ మిల్ అమీర్ పై టీడీపీ చైర్మెన్ అభ్యర్థి డాక్టర్ భవన్ 8407 ఓట్లతో విజయం సాధించారు.ఈ ఎన్నికల్లో వైసిపి కౌన్సిలర్ గా 27 మంది,టీడీపీ 24 బీజేపీ ఒకరు గెలుపొందారు.గెలుపొందిన అభ్యర్థులు మంత్రి ఫరూక్,ఆయన తనయులు ఫిరోజ్,ఫయాజ్,ఏవీ సుబ్బారెడ్డి,సీనియర్ న్యాయవాది రామచంద్ర రావు,వైసిపి మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి,ఎమ్మెల్సీ ఇసాక్ భాషకు అభినందనలు తేలిపోయారు.



కేజీబీవీలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

100 రోజుల ప్రత్యేక ప్రచారంలో భాగంగా విద్యార్థినులకు చట్టాలు, బాలల హక్కులపై అవగాహన



వెలుగోడు, నవంబర్ 04 (నంది పత్రిక): బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో నిర్మూలించి, బాలల హక్కులను పరిరక్షించడమే లక్ష్యంగా చేపట్టిన 'బాల్య వివాహ రహిత భారత్' 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం వెలుగోడు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనిజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం డిసిపియు ప్రతినిధులు విద్యార్థినులకు బాలల హక్కులు, చట్టాలు, భద్రతకు సంబంధించిన పలు అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల బాలికల భవిష్యత్తుపై పడే ప్రభావం, వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యతపై అవగాహన కల్పించారు. బాలికల రక్షణ కోసం అమలులో ఉన్న పోక్సో చట్టంలోని ముఖ్య నిబంధనలు, పిల్లల చట్టబద్ధమైన దత్తత విధానాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. బాలలు ఎలాంటి ఆపదలో ఉన్నా, వేధింపులకు గురైనా తక్షణ సహాయం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు.

1098, ఇజ్జూళ ఆకారాల్లో విద్యార్థినుల మానవహారం కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు 1098, డిసిపియుఅక్షరాలు, అంకెల ఆకారాల్లో మానవహారంగా ఏర్పడి బాలల సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థినులు బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తామని, బాలల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో వెలుగోడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామలమ్మ, రమణమ్మ, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నూతన ఎంపీటీసీలకు ఘన సన్మానం.. పూలమాలలు, శాలువాలతో సత్కారం

పోరుమామిళ్ల, నవంబర్ 4 (నంది పత్రిక):స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మండలంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైకాపా) నాలుగు ఎంపీటీసీ స్థానాలను ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. ఈ ఎన్నికల్లో వైకాపా తరఫున పోటీ చేసి ఏకగ్రీవంగా ఎన్నికైన చిత్తగిరి ప్రణీత్ రెడ్డి, ముత్యాల ప్రసాద్‌లకు మండల వ్యాప్తంగా ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ విజయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూలమాలలు, శాలువాలతో సత్కారం వైకాపా నాలుగు స్థానాలను కైవసం చేసుకున్న సందర్భంగా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు చిత్తగిరి ప్రణీత్ రెడ్డి, ముత్యాల ప్రసాద్‌లను స్థానిక వైకాపా యువజన నాయకులు నాగదాసరి వినయ్, ఆయన సతీమణి, మాజీ వార్డు సభ్యురాలు తబిత ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఎంపీటీసీలకు పూలమాలలు వేసి,



శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. మిఠాయిలు తినిపించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. జగనన్న సంక్షేమ పాలనకు నిదర్శనం: వినయ్, తబితసన్మానం అనంతరం నాగదాసరి వినయ్, మాజీ వార్డు సభ్యురాలు తబిత దంపతులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రతి ఇంటికీ చేరుతున్న అభివృద్ధి కార్యక్రమాల వల్లే ప్రజలు వైకాపాకు మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఈ ఏకగ్రీవ విజయాలు జగనన్న పాలనపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు.ఏకగ్రీవంగా ఎన్నికైన చిత్తగిరి ప్రణీత్ రెడ్డి, ముత్యాల ప్రసాద్‌లు భవిష్యత్తులో పోరుమామిళ్ల మండల పరిధిలోని గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తారని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మండలంలో సంబరాలు వైకాపా అభ్యర్థుల ఏకగ్రీవ ఎన్నికలతో పోరుమామిళ్ల మండలంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సన్మాన కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాణాసంచా కాలుస్తూ, పార్టీ నినాదాలతో సంబరాలు జరుపుకున్నారు. నూతన ఎంపీటీసీలకు వివిధ గ్రామాల ప్రజల నుంచి అభినందనలు అందుతున్నాయి.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో



బద్వేల్ నవంబర్ 4(నంది పత్రిక): జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్ననేపథ్యంలో గోపవరం గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల ఏర్పాట్లను బద్వేల్ ఆర్డీవో ఎ. చంద్ర మోహన్ పరిశీలించారు. డీఎల్‌డీఓ, బద్వేల్ ఎంపీడీఓ, తహసీల్దార్‌తో కలిసి పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్, రిసెప్షన్ హాల్‌లను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

బండి ఆత్మకూరు మండలంలో 42 పోలింగ్ కేంద్రాలు 260 మంది పోలింగ్ సిబ్బంది



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 4 : నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి లీలావతి వెల్లడించారు. గురువారంనిర్వహించనున్న పోలింగ్‌కు సంబంధించి అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారని తెలిపారు. మండల పరిధిలో మొత్తం 38,380 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. వీరిలో 19,664 మంది మహిళా ఓటర్లు, 18,711 మంది పురుష ఓటర్లు, ఐదుగురు ఇతర ఓటర్లు ఉన్నట్లు వివరించారు.మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి మొత్తం 42 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆర్వో తెలిపారు. ఎన్నికల నిర్వహణను సులభతరం చేయడంతో పాటు పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు మండలాన్ని మూడు జోన్లుగా విభజించినట్లు చెప్పారు. ఎన్నికల విధుల నిర్వహణ కోసం మొత్తం 260 మంది సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సిబ్బందికి సూచించారు.పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని పంచాయతీ సిబ్బందికి ఇదివరకే ఆదేశాలు జారీచేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్వో లీలావతి లింగాపురం, జీసీ పాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను స్వయంగా తనిఖీ చేశారు. అక్కడి ఏర్పాట్లను పరిశీలించి, పోలింగ్ సజావుగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు.



నేడు కర్నూలు జిల్లాలోని అన్ని బ్యాంకులకు స్థానిక సెలవు

జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి



నంది పత్రిక కర్నూలు బ్యూరో : కర్నూలు జిల్లాలో రెండవ సాధారణ ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈ నెల 5వ తేదీన జిల్లాలోని అన్ని బ్యాంకులకు స్థానిక సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్, 1881 కింద ఈ స్థానిక సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి





నేడు 26 జడ్పీటీసీ, 358 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్

ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్..

అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు వీడియోగ్రఫీ ఏర్పాటు

ఓటర్ స్లిప్ ఉన్నా లేకపోయినా సరే, కానీ 20 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఉండాల్సిందే!

జిల్లా కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి

నంది పత్రిక కర్నూలు బ్యూరో : నవంబర్ 5 వ తేదీన నిర్వహించనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి తెలిపారు. జిల్లాలో మొత్తం 432 ఎంపీటీసీ స్థానాలకు గాను 74 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 358 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నామన్నారు. అదే విధంగా 26 జడ్పీటీసీ స్థానాలకు పోలింగ్ జరగనుందన్నారు. జడ్పీటీసీ స్థానాలకు 97 మంది, ఎంపీటీసీ స్థానాలకు 907 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. జిల్లాలో మొత్తం 12,50,166 మంది గ్రామీణ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. వీరిలో 6,21,167 మంది పురుషులు, 6,28,834 మంది మహిళలు, 165 మంది ఇతర ఓటర్లు ఉన్నారన్నారు. నవంబర్ 7వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.జిల్లా వ్యాప్తంగా 648 ప్రాంతాల్లో మొత్తం 1,432 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంపులు తదితర కనీస ప్రాథమిక సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటిలో 299 అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, 398 సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, 735 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా పర్యవేక్షించేందుకు 697 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, 735 పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీ ఏర్పాటు చేశారన్నారు. సున్నితమైన, అతి సున్నితమైన ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు 255 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే ఓటింగ్ ప్రక్రియను సీసీ కెమెరాల ద్వారా తాను, ఎన్నికల సంఘం పర్యవేక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఎన్నికల నిర్వహణ కోసం 1,575 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,578 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 5,128 మంది ఇతర పోలింగ్ అధికారులు కలిపి మొత్తం 8,281 మంది పోలింగ్ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు కోసం 2,172 మంది సిబ్బందిని కేటాయించడం జరిగిందన్నారు.

ఓటర్ స్లిప్ ఉన్నా లేకపోయినా సరే, కానీ 20 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఉండాల్సిందే

ఓటర్ స్లిప్ ఉన్నా లేకపోయినా సరే, 20 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి మాత్రం ఓటరు చూపించాల్సి ఉందని, అందువల్ల ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఆదాయపు పన్ను శాఖ జారీ చేసిన పాన్ కార్డు లాంటి 20 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తెచ్చుకోవాలని, ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు.

ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలు

శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి డా. ఏ. సిరి



నంది పత్రిక కర్నూలు బ్యూరో : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంతో పాటు శాంతిభద్రతలను పరిరక్షించేందుకు జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బి ఎన్ ఎస్ ఎస్) సెక్షన్ 163 (గతంలో సి ఆర్ పి సి సెక్షన్ 144) కింద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, శాంతిభద్రతలు కొనసాగించే ఉద్దేశంతో ఈ ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఆదేశాల ప్రకారం ప్రతి పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో నలుగురు కంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడటం నిషేధమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే విధంగా వ్యవహరించడం, గుంపులుగా చేరడం వంటి చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదన్నారు. ఎన్నికల నిబంధనలు, నిషేధాజ్ఞలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

మహానంది మండలంలో ప్రతిష్ట పోలీస్ బందోబస్తు



మహానంది నవంబర్ 04 (నంది పత్రిక):- మహానంది మండలంలో జరగనున్న ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌కు ప్రతిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ ఐ శివాంజల్ తెలిపారు.మండలంలోని 38 పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ భద్రతా చర్యలు చేపట్టామన్నారు. గురువారం జరిగే పోలింగ్ కోసం ఇద్దరు సీఐలు,4 గురు ఎస్ఐలతో పాటు సుమారు 100 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహానంది మండలంలో 237 మంది సిబ్బంది ఎన్నికల విధులు



మహానంది నవంబర్ 04 (నంది పత్రిక):- మహానంది మండలంలో ఎంపీటీసీ ,జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పక్కడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఆర్వో ఎస్. అబ్దుల్ రహిమాన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని 11 ఎంపీటీసీ స్థానాల్లో పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల విధులకు సంబంధించి మొత్తం 237 మంది సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. 46 మంది పీవో, 46 మంది ఏపీవో 145 మంది వోపీవో ఎన్నికలలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కు ఏర్పాట్లు



మహానంది నవంబర్ 04 (నంది పత్రిక):- మహానంది మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్వోఎస్.అబ్దుల్ రహిమాన్ పేర్కొన్నారు .తిమ్మాపురం గ్రామం లోని ఏపీ మోడల్ స్కూల్లో 11 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఎన్నికల సామాగ్రిని సురక్షితంగా తరలించినట్లు తెలిపారు.మొత్తం 38 పోలింగ్ కేంద్రాలకు సంబంధిత ఎన్నికల సామాగ్రిని ఆయా కేంద్రాల్లో చేరే వేశామన్నారు.

రవలకొండ ఆలయంలో 8న స్వాతి వేడుకలు

బనగానపల్లె నవంబర్4నందిపత్రిక బనగానపల్లె మండల పరిదిలోని భానుముక్కల గ్రామ పరిధిలో , రవలకొండపై, వెలసిన శ్రీ శ్రీ శ్రీ చెంచులక్ష్మి సమేత పావన నరసింహ స్వామి దేవస్థానము నందు నవంబర్ 8 ఆదివారం స్వాతి వేడుకలు జరుగునని, ఆ దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, నిర్మాణ కర్త, ధర్మకర్త, విశ్వహిందూ పరిషత్ ప్రచారకులు మరియు ప్రధాన అర్చకులు అయినటువంటి బాలిశెట్టి పావన నరసింహమూర్తి బుధవారం తెలిపారు.అదేసమయంలో ,8న దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశం ఉందని ఆయన తెలియజేశారు. ఇందులో తొమ్మిది మంది శాశ్వత సభ్యులు ఉన్నట్టు, వారందరూ కూడా ఆరోజు దేవస్థానం సమావేశములో పాల్గొంటారని తెలిపారు. ఈ దేవస్థానం ప్రత్యేకత! నవ నారసింహులు నవగ్రహాలు కలిపి పుట్టు శిల, పుట్ట, నాగులు, స్వయంభు శివలింగము, కృష్ణుడు మరియు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు అయినటువంటి వారి అమ్మవారి విగ్రహ ము ఉండడం విశేషం. ఎందుకంటే గర్భగుడి లోనికి, పోయేముందు వారి అమ్మగారికి, పూజ చేసిన తర్వాతనే గర్భగుళ్ళకి వెళ్లడం జరుగుతుందన్నారు. స్వాతి రోజు ఉదయం మంగళ వాయిద్యాలతో, మొదలై స్వామివారికి సుప్రభాతముతో, తులసీదళాలతో అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, ఆకు పూజ అర్చనలు. జరుగుతాయని ఆయన తెలియజేశారు. కావున ఈ అవకాశాన్ని భక్తులందరూ ఉపయోగించుకొని, అలాగే తమ తమ కోరికలు స్వామివారికి విన్నవించుకొని స్వామివారి ఆశీస్సులు పొందగలరని నరసింహ మూర్తి తెలిపారు.

జెడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికల పోలింగ్‌కు... సర్వం సిద్ధం..!

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

21 మండలాల్లో 599 పోలింగ్ కేంద్రాలు.. 5.94 లక్షల మంది ఓటర్లు

16 జెడ్పిటిసి, 55 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు

అత్యంత భద్రతతో పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రి తరలింపు

ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

కడప, బ్యూరో చీఫ్ నవంబర్ 4 నంది పత్రిక: వైఎస్సార్ కడప జిల్లాలో నవంబర్ 5న నిర్వహించనున్న జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ సామగ్రిని అన్ని పంపిణీ కేంద్రాల నుంచి నిర్దేశించిన మార్గాల్లో ఆయా పోలింగ్ కేంద్రాలకు భద్రంగా చేర్చినట్లు వెల్లడించారు. పోలింగ్ సిబ్బంది నియామకం, శిక్షణ, రవాణా, భద్రత, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు తదితర అన్ని అంశాలను పూర్తి చేసి ఎన్నికల యంత్రాంగాన్ని సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 39 మండలాలకు గాను ఎన్నికల ప్రక్రియలో భాగంగా 21 మండలాల పరిధిలో 16 జెడ్పిటిసి, 55 ఎంపిటిసి స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. మొత్తం 599 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, జెడ్పిటిసి పరిధిలో 4,47,809 మంది, ఎంపిటిసి పరిధిలో 1,46,290 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు.

ఎన్నికల ముఖ్య వివరాలు..

జిల్లాలో మొత్తం మండలాలు: 39
ఎన్నికలు జరిగే మండలాలు: 21
జెడ్పిటిసి స్థానాలు: 16
ఎంపిటిసి స్థానాలు: 55
మొత్తం పోలింగ్ కేంద్రాలు: 599
జెడ్పిటిసి ఓటర్లు: 4,47,809
ఎంపిటిసి ఓటర్లు: 1,46,290
జెడ్పిటిసి అభ్యర్థులు: 71
ఎంపిటిసి అభ్యర్థులు: 171
మొత్తం అభ్యర్థులు: 242

పోలింగ్ కేంద్రాల వారీగా ఏర్పాట్లు:..

ఎన్నికలు జరిగే 21 మండలాల్లో 599 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బి.మఠం మండలంలో 46, రాజంపేటలో 62, వేంపల్లిలో 56, మైలవరంలో 44, తుగ్గలి సుందుపల్లిలో 37, పెద్దముడియంలో 36, కలసపాడులో 34, లింగాలలో 33, మైదుకూరులో 32, నందలూరులో 32, వేములలో 38, వొంటిమిట్టలో 30, బి.కోడూరులో 23, గోపవరంలో 20, పులివెందులలో 15, ఎస్.ఏ. కాశినాయనలో 31, సిద్దవటంలో 8, దువ్వూరులో 8, పోరుమామిళ్లలో 7, ప్రొద్దుటూరులో 4, వీరబల్లిలో 3 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పోటీలో 242 మంది అభ్యర్థులు:

జెడ్పిటిసి ఎన్నికల్లో 16 స్థానాలకు సంబంధించి మొత్తం 71 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఎంపిటిసి ఎన్నికల్లో 55 స్థానాలకు 171 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తంగా 242 మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో ఉన్నట్లు ఎన్నికల వివరాలు వెల్లడిస్తున్నాయి.

పోలింగ్ సిబ్బంది నియామకం :

599 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 599 మంది ప్రిసైడింగ్ అధికారులు, 599 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 1,797 మంది ఇతర పోలింగ్ అధికారులు కలిపి మొత్తం 2,995 మంది సిబ్బందిని నియమించారు. వీరితో పాటు 15 శాతం చొప్పున అదనపు సిబ్బందిని కూడా సిద్ధం చేశారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు అక్టోబర్ 22న తొలి విడత శిక్షణ నిర్వహించగా, నవంబర్ 2న రెండో విడత శిక్షణ నిర్వహించినట్లు నివేదికలో పేర్కొన్నారు.

బ్యాలెట్ పత్రాల ముద్రణ, పంపిణీ:

జెడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి మొత్తం 5,06,900 బ్యాలెట్ పత్రాలు, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి 1,66,810 బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఇందులో అదనపు నిల్వ, పోస్టల్ బ్యాలెట్ పత్రాల అవసరాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాల ముద్రణ పూర్తయిందని, వాటిని సంబంధిత మండలాలకు తరలించే ప్రక్రియ చేపట్టినట్లు నివేదికలో పేర్కొన్నారు. సాధారణ బ్యాలెట్ పత్రాల ముద్రణను వేగవంతం చేసి పంపిణీ ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు.

సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక భద్రత:..

జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో 134 సున్నిత, 167 అత్యంత సున్నిత, 5 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. మొత్తం 306 కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. ఆయా ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు, నిరంతర పర్యవేక్షణతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.

రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు సిద్ధం:

పోలింగ్ అనంతరం ఎన్నికల సామగ్రి స్వీకరణకు, భద్రపరిచేందుకు, ఓట్ల లెక్కింపునకు ఐదు రెవెన్యూ డివిజన్ల పరిధిలో కేంద్రాలను గుర్తించారు. బద్వేలు డివిజన్‌కు సంబంధించి అంబేడ్కర్ గురుకులం, జమ్మలమడుగు డివిజన్‌కు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కడప డివిజన్‌కు మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయం, పులివెందుల డివిజన్‌కు జెడ్పీ ఉన్నత పాఠశాల రామన్నపల్లె సత్రం, రాజంపేట డివిజన్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ పెట్టెలను భద్రత మధ్య ఆయా కేంద్రాలకు తరలించి, స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచేలా ఏర్పాట్లు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను కూడా నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు.

ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి:

ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఎన్నికల సిబ్బంది, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పోలింగ్‌ను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.



తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రహదారుల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు

తుఫాన్ దాటికి 162.841 కి.మీ. మేర దెబ్బతిన్న రహదారులు.. 201 చెట్ల తొలగింపు పూర్తి

రహదారుల మరమ్మతులకు రూ.143.36 కోట్ల అవసరమని ప్రాథమిక అంచనా

రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



బనగానపల్లె నవంబర్ 4నందిపత్రిక మురసు తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నట్లు మంత్రి కార్యాలయం బుధవారం తెలిపారు. అందులో ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా రహదారులపై పడిపోయిన చెట్ల తొలగింపు, ట్రాఫిక్ పునరుద్ధరణ, దెబ్బతిన్న ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మతులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన జిల్లా రహదారులు, రాష్ట్ర రహదారులకు సంబంధించి మొత్తం 162.841 కిలోమీటర్ల మేర రహదారి ఉపరితలం దెబ్బతిన్నట్లు మంత్రి వెల్లడించారు. రెండు చోట్ల స్కార్ప్, నాలుగు చోట్ల రోడ్డు కోతలు, ఐదు కల్వర్టు సంబంధిత పనులు దెబ్బతిన్నట్లు తెలిపారు.తుఫాన్ ప్రభావంతో 201 చెట్లు నేలకూలగా, అధికారులు తక్షణమే స్పందించి మొత్తం 201 చెట్లను తొలగించినట్లు చెప్పారు. వివిధ ప్రాంతాల్లో 73 చోట్ల ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడగా, ఇప్పటికే 34 చోట్ల రాకపోకలను పునరుద్ధరించినట్లు వివరించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.జిల్లాల వారీగా పరిశీలిస్తే శ్రీ= నెల్లూరు జిల్లాలో 66.600 కి.మీ., చీ= జిల్లాలో 52.683 కి.మీ., పశ్చిమ గోదావరి జిల్లాలో 38.572 కి.మీ., ప్రకాశం జిల్లాలో 3.600 కి.మీ., పల్నాడు జిల్లాలో 1.386 కి.మీ. మేర రహదారులు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక, శాశ్వత మరమ్మతుల కోసం మొత్తం రూ.143.36 కోట్ల నిధులు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు. ఇందులో తాత్కాలిక మరమ్మతులకు రూ.16.66 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.126.70 కోట్లు అవసరమని వివరించారు.తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ఆర్ అండ్ బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ దెబ్బతిన్న రహదారుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రమాదకర ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రహదారుల పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన యంత్రాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ప్రజలకు రవాణా సౌకర్యాలు పూర్తిస్థాయిలో పునరుద్ధరించే వరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి దంపతులను కలిసిన కర్నూలు మేయర్ బి విజయ ప్రత్యూష



కర్నూలు సిటీ నంది పత్రిక కర్నూలు నగర మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ మేయర్ అభ్యర్థి బొల్లెద్దుల విజయ ప్రత్యూష ఘన విజయం సాధించారు. బుధవారం టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు టిడిపి ఇన్చార్జి గౌరు వెంకట రెడ్డి, యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డిని వారి నివాసంలో మేయర్ బి విజయ ప్రత్యూష.మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #D.NO.: 1-639-1-7-11, NEAR NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPARI, ANANTHAPURAMU, ANDHRA PRADESH-515411, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6831. Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో కోడుమూరు, కున్నూరు, కప్పట్రాళ్ల, హోసూరు, ఆస్పరి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించినకర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి.



కర్నూలు సిటీ నందిపత్రిక నేడు జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ బుధవారం కోడుమూరు, కున్నూ రు, కప్పట్రాళ్ల, హోసూరు, ఆస్పరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తును పరిశీలించి, అక్కడ విధుల్లో ఉన్న అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పకడ్బందీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.విధుల్లో ఎవరూ నిర్లక్ష్యం, అలసత్వం వహించకుండా సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, సీఐలు మధుసూదన్ రావు, తబ్రేజ్, శేషయ్య, ధనుంజయ, మన్సూరుద్దీన్, నాగరాజరావు, కోడుమూరు ఎస్సై డీవై స్వామి పాల్గొన్నారు.

ఓటర్లకు అందని ఓటు స్లిప్పులు

టిడిపి నాయకులకు ఓటరు స్లిప్పులు అందజేస్తున్న సచివాలయ అధికారి

ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన వైసీపీ నాయకులు కెవి రమణారెడ్డి

కర్నూలు సిటీ నంది పత్రిక కర్నూలు జిల్లా కల్లూరు మండలం బస్తిపాడు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఓటర్ స్లిప్పులు అందజేయాల్సిన సచివాలయ ఉద్యోగి టిడిపి నాయకులకు సచివాలయంలోనే బల్కుగా ఓటరు స్లిప్పులను అందజేస్తుందని వైఎస్ఆర్సిపి నాయకులు కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కె.వి రమణారెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎంపీటీసీ ఎన్నికలలో భాగంగా ఓటరు స్లిప్పులను ఓటు హక్కుదారులకే ఇవ్వాల్సి ఉన్నా సచివాలయ ఉద్యోగి కాన్ఫేబుల్ అన్నపూర్ణ కేవలం టిడిపి నాయకులకే పదుల సంఖ్యలో ఓటర్ స్లిప్పులను అందజేస్తున్నదని సదరు ఉద్యోగపై ఎలక్షన్ నిబంధనలు మేరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకులు తమ వద్దనే ఓటరు స్లిప్పులను ఉంచుకుని ఓటు వేయకుండా అడ్డుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న సదరు కానిస్టేబుల్ అన్నపూర్ణపై. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



పెద్దకొప్పెర్ల లో ప్రభలిన విష జ్వరాల పై మెడికల్ క్యాంపు



కోవెలకుంట్ల నవంబర్ 4నందిపత్రిక కోయిలకుంట్ల మండలం రేవనూరు పిహెచ్సి పరిధిలో ఉన్న పెద్ద కొప్పెర్ల గ్రామం లో ప్రభలిన విష జ్వరాలను అదుపు చేసేందుకు బుధవారం గ్రామం నందు రేవనూరు పిహెచ్ సి వైద్యులు డాక్టర్ సుభాని ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర రావు గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ఇంటింటికి తిరిగి గ్రామం నందు ఇంకా ఏమైనా జ్వరం కేసులు ఉన్నాయా అని తనిఖీ చేశారు.అనంతరం కోయిలకుంట్ల లోని సిహెచ్సి నందు కూడా జ్వర బాధితులను పరీక్షించారు కానీ ఆ జ్వరం కేసులన్నీ వైరల్ జ్వరాలని అక్కడ ఉన్న వైద్యులు చంద్రశేఖర రెడ్డి తెలిపారు. పెద్దకొప్పెర్ల గ్రామ పంచాయితీ కార్యదర్శి గ్రామమునందు నీరు నిల్వ ఉన్నచోట అన్ని ప్రాంతాలలో స్ప్రేయింగ్ చేయించారు. నీటిని వేడి చేసుకుని త్రాగాలని పరిశుభ్రత పాటించాలని వైద్యులు గ్రామస్తులకు సూచించారు.గ్రామంలో అవసరమైన వారికి అందరికీ రక్త పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమనందు వైద్యులు, ఇతర మెడికల్ సిబ్బంది విశ్వనాథ్ లక్ష్మీదేవి సూపర్వైజర్ సిస్టర్ పంచాయతీ సెక్రెటరీ పద్మావతి మరియు ఎస్వీ బ

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు పటిష్ట భద్రత.

జిల్లా వ్యాప్తంగా 2,155 మంది పోలీసులతో పటిష్ట భద్రత.

- ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా... అదనపు బలగాల మోహరింపు.

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ.

- ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు: కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

కర్నూలు సిటీ నందిపత్రిక నేడు కర్నూలు జిల్లా వ్యాప్తంగా జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని ముందస్తు భద్రతా ఏర్పాట్లను పూర్తి చేసిందని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ బుధవారం తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు.జిల్లాలోని కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు 4 సబ్ డివిజన్ల పరిధిలలో ఎన్నికలు జరగనున్నాయి.94 అత్యంత సమస్యాత్మక, 162 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లుగా గుర్తించి, ఆయా ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టామన్నారు.



భద్రతా బలగాల మోహరింపు ప్రత్యేక నిఘా: జిల్లా ఎస్పీ నేతృత్వంలో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 7 మంది డీఎస్పీలు, 39 మంది సీఐలు, 61 మంది ఎస్సైలు, 87 మంది ఏఎస్సైలు, 236 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 693 మంది కానిస్టేబుళ్లు, 316 మంది హోంగార్డులతో పాటు 13 ఏపీఎస్పీ ప్లటూన్లు మరియు ఏ ఆర్ పోలీసులు, అటవీ, విజిలెన్స్, ఎక్సైజ్, రైల్వే శాఖల సిబ్బందితో కలిపి మొత్తం 2,155 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

- ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి:

గత చరిత్రను దృష్టిలో ఉంచుకుని ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. .

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అదనపు బలగాలను మోహరించారు.

- మొబైల్ నిఘా బృందాలు: 175 రూట్ మొబైల్ బృందాలు, 30 ప్లైకింగ్ ఫోర్స్ బృందాలు, 30 స్పెషల్ ప్లైకింగ్ ఫోర్స్ బృందాలు, 7 డీఎస్పీ ప్లైకింగ్ ఫోర్స్ బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తాయి.

- చెక్ పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్: ఎన్నికల నియమావళి అమలును పర్యవేక్షించేందుకు 26 ఫ్లయింగ్ స్క్వాడ్స్ (ఎంసీసీ), 26 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్టీ) / చెక్ పోస్టులు, 11 శాంతిభద్రతల పికెట్లను ఏర్పాటు చేశారు.

- సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా: .

సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ద్వారా కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షణ చేపడతారు.

- ముందస్తు బైండోవర్లు: ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడే అవకాశం ఉన్న నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, అల్లర్లకు కారణమయ్యే వ్యక్తులను గుర్తించి ముందస్తు బైండోవర్ చర్యలు చేపట్టామన్నారు.రాజకీయ నాయకులు, అభ్యర్థులు, ప్రజలు పాటించాల్సిన నిబంధనలు రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్నికల సంఘం జారీ చేసిన పాసులు లేదా అనుమతి ఉన్న వాహనాల్లో మాత్రమే ప్రయాణించాలి. అనుమతి లేని వాహనాల్లో తిరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

- సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలు:

ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయి.

అనుమతి లేకుండా నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న వెంటనే ఓటర్లు తమ ఇళ్లకు వెళ్లిపోవాలి.పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇంకు సీసాలు లేదా ఇతర నిషేధిత వస్తువులను తీసుకెళ్లడానికి అనుమతి లేదు.ఇప్పటికే విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ నగదు, మద్యం, ఇతర వస్తువుల రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

- సోషల్ మీడియాపై నిఘా.

వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా, తప్పుడు ప్రచారం చేసినా, పుకార్లు వ్యాప్తి చేసినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయాలి – డీపీవో అబ్దుల్ సలామ్

ఈర్నపాడులో నూతన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 04(నంది పత్రిక)గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతం చేయడంతోపాటు రైతులకు అవసరమైన ప్రకృతి వ్యవసాయ ఉత్ప్రేరకాలను సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో బయో-రిసోర్స్ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఇందులో భాగంగానే నంద్యాల జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్ సలామ్ పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని బందిఅత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో "శ్రీశైల మల్లిఖార్జున స్వామి గో-ఆధారిత ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం"ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేలతల్లిని పరిరక్షించుకుంటూ విషరహిత, ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ద్వారా స్థానిక రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రైతులందరూ ఈ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రం ద్వారా పంటలను చీడపీడల నుంచి రక్షించడానికి, నేల సారాన్ని పెంచడానికి అవసరమైన ఘన, ద్రవ జీవమృతాలతో పాటు వివిధ రకాల కషాయాలు ఇక్కడ నిరంతరం అందుబాటులో ఉంటాయని చెప్పారు. వాతావరణ మార్పులను తట్టుకుంటూ భూమిలో నిరంతరం ఆచ్ఛాదన, జీవవైవిధ్యాన్ని పెంపొందించే ప్రీ-మొన్సూన్ డ్రై సోయింగ్ కిట్లు రైతులకు సులభంగా లభిస్తాయన్నారు. ప్రతి ఇంటికి అవసరమైన పోషకాహారాన్ని, తాజా ఆకుకూరలను సొంతంగా పండించుకోవడానికి వీలుగా కిచెన్ గార్డెన్ కిట్లను ఈ కేంద్రం ద్వారా అందిస్తారన్నారు. గో-ఆధారిత ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం అందుబాటులోకి రావడంతో ఈర్నపాడు చుట్టుపక్కల గ్రామాల రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను మరింత సులభంగా ఆచరించేందుకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. రైతులందరూ రసాయన సాగుకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేసి సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ భీమేష్, మాస్టర్ ట్రైనర్ బాషా, బిఆర్సి ఓనర్లు ఈశ్వరయ్య, రామసుబ్బారెడ్డి, ఎఫ్ఎంటిలు, ఐసిఆర్పిలు, వివో-ఓబిలు, విఓఏ, యువ రైతులు పాల్గొన్నారు.

కర్నూలు జి జి హెచ్ లో రెండు అరుదైన శస్త్రచికిత్సలు విజయవంతం!

ఆధునిక థొరాకోస్కోపీ, ల్యాపరోస్కోపీ విధానాల్లో క్లిష్టమైన ఆపరేషన్లు నిర్వహించిన వైద్య బృందం!



కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జి జి హెచ్) వైద్యులు ఒకే వేదికపై రెండు క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి తమ వైద్య నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఆదోనికి చెందిన 52 ఏళ్ల ఇక్బాల్ బాషాకు డయాఫ్రాగ్మాటిక్ హెర్నియా సమస్యకు ఆధునిక థొరాకోస్కోపిక్ విధానంలో శస్త్రచికిత్స నిర్వహించారు. అలాగే, రోడ్డు ప్రమాదంలో ప్లీహానికి తీవ్ర గాయమైన గూడూరుకు చెందిన 32 ఏళ్ల మసూం మియాకు ల్యాపరోస్కోపిక్ స్ప్లీనెక్టమీ విజయవంతంగా చేశారు. ఈ శస్త్రచికిత్సలను సర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో సర్జరీ, మత్తుమందు విభాగాల వైద్య బృందాలు సమన్వయంతో నిర్వహించాయి.

శస్త్రచికిత్సల అనంతరం ఇద్దరు రోగులు సంతృప్తికరంగా కోలుకున్నారు.

ఈ శస్త్రచికిత్సల్లో సర్జరీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సబీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రణీత్, డాక్టర్ ప్రశాంతి, పీజీ వైద్యులు డాక్టర్ మనోజ్, డాక్టర్ తేజ, డాక్టర్ ఆంచల్, డాక్టర్ సోమశేఖర్ కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా మత్తుమందు విభాగం నుంచి ప్రొఫెసర్ డాక్టర్ రామ్ శివ నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మురళీ ప్రభాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సుధీర్, డాక్టర్ శివ సమన్వయంతో కీలక సేవలు అందించారు.ఈ సందర్భంగా సర్జరీ విభాగాధిపతి డాక్టర్ హరిచరణ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు వైద్య బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే అత్యాధునిక శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని కర్నూలు జి జి హెచ్ మరోసారి నిరూపించింది.

మంత్రిని మేయర్ ని కలిసి సన్మానించిన 48 వ వార్డు కార్పొరేటర్, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్ కమ్మరి పార్వతమ్మ



కర్నూల్ సిటీ నందు పత్రిక టీజీ భరత్ ఆఫీస్ నందు మర్యాదపూర్వక సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఆహార శుద్ధి శాఖ మంత్రివర్యులు టీజీ భరత్ ని, కర్నూలు నగర మేయర్ బోల్లెద్దుల విజయ ప్రత్యూష ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన 48వ వార్డు కార్పొరేటర్ యస్ .రాఘవేంద్ర , ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ కలిశారు ఈ సమావేశంలో 48వ వార్డు ఇన్చార్జి నాగేశ్వరరావు , టీడీపీ కార్యకర్తలు ఇమ్మానియేల్(గిడ్డయ్య), గాంధీ, ప్రకాశం, అయ్యన్న, పర్ష తదితరులు పాల్గొన్నారు.

గ్లాస్ గుర్తుకే ఓటు వేసి గెలిపించవలసిందిగా కోరుతూ జనసేన జడ్పీటిసి అభ్యర్థి: సప్పోరు భాస్కర్



ఎమ్మిగనూరు నవంబర్ 4 నంది పత్రిక ఎమ్మిగనూరు మండల ప్రజలందరూ జెడ్పిటిసి అభ్యర్థిగా జనసేన పార్టీ తరపున ఎన్డీఏ కూటమి ఆశీర్వాదంతో పోటీ చేసిన నన్ను ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించవలసిందిగా ఓటర్లకు విజ్ఞప్తి. నన్ను గెలిపిస్తే ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కారం చేస్తానని, గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఎటువంటి ఇబ్బందులు అయినా పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు.

కల్లూరు అర్బన్ 49వ వార్డులో వైఎస్ఆర్సీపీ అభ్యర్థి సమీనా భాను ఘన విజయం



కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కల్లూరు అర్బన్ 49వ వార్డు వైఎస్ఆర్సీపీ కార్పొరేటర్ అభ్యర్థి షేక్ సమీనా భాను 263 మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా, వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డిని, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ ని, వైఎస్ఆర్సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కాటసాని కుటుంబ సభ్యులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం సమీనా భాను విజయంపై కాటసాని రామభూపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.వైఎస్ఆర్సీపీ కార్పొరేటర్ అభ్యర్థిగా విజయం సాధించిన సమీనా భాను కి కాటసాని కుటుంబం శుభాకాంక్షలు తెలిపింది. ఈ కార్యక్రమంలో 48 మరియు 49వ వార్డు నాయకులు, కార్యకర్తలు ముస్లిం సోదరులు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యం

నేడు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వండి! రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆదరించండి ప్రజాసేవకు అవకాశం కల్పించండి: డీసీసీ అధ్యక్షులు అడ్వకేట్ బోయ క్రాంతి నాయుడు



కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు జిల్లాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున కర్నూలు నగరపాలక సంస్థ, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీలలో అభ్యర్థులను బరిలో నిలిపి ప్రజల మద్దతు కోరామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ బోయ క్రాంతి నాయుడు తెలిపారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ పాలనలోనే కర్నూలు జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు, యువత, విద్యార్థులను పార్టీకి చేరువ చేస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, గ్రామీణాభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.నేడు జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటును వేసి, చేతి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే రాబోయే గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులను ఆదరించి ప్రజాసేవకు అవకాశం కల్పించాలని కోరారు.గ్రామాల అభివృద్ధి, తాగునీరు, రహదారులు, డ్రైనేజీలు, విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా స్థానిక సంస్థలను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ పోరాటం కేవలం ఎన్నికలకే పరిమితం కాదని, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామగ్రామాన కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ప్రజా సంక్షేమ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ప్రజల కోసం ప్రజలతో కలిసి
అభివృద్ధి కోసం కాంగ్రెస్!
చేతి గుర్తుకు ఓటు వేయండి కాంగ్రెస్
అభ్యర్థులను గెలిపించండి!

ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఐ ఎన్ టి యు సి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ మాజీ కార్పొరేటర్ ఎం శివానంద్, జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు షేక్ రియాజుద్దీన్, బి సుబ్రహ్మణ్యం, ఎస్సీ సెల్ డబ్ల్యూ సత్యరాజు కార్పొరేటర్ అభ్యర్థులు న్యాయవాది బి రాకేష్, డివి చంద్ర, బిరు స్రవంతి, విజయ భాస్కర్ మొదలగు వారు పాల్గొన్నారు.

భార్యాభర్తల విజయభేరి..

ఎమ్మిగనూరు రాజకీయాల్లో మాచాని జోడీ హవా!



భార్యకు 22,700కు పైగా ఓట్ల భారీ ఆధిక్యం! భర్తకు 730 ఓట్ల మెజారిటీ.. ఒకరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా.. మరొకరు కౌన్సిలర్‌గా కౌన్సిల్‌లోకి!

ఎమ్మిగనూరు నవంబర్ 4 నంది పత్రిక ఎమ్మిగనూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగించింది. మొత్తం 44 వార్డులకు గాను 40 వార్డులను కైవసం చేసుకుని కూటమి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ ఎన్నికల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది మాత్రం మాచాని భార్యాభర్తల జోడీ విజయం! 37వ వార్డు నుంచి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు మాచాని మహేష్ కుమార్ 730 ఓట్ల భారీ మెజారిటీతో కౌన్సిలర్‌గా విజయం సాధించగా, ఆయన సతీమణి, కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థి మాచాని సునీత 22,700కు పైగా ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలిద్దరూ ఒకేసారి ఎన్నికల్లో పోటీ చేసి విజయకేతనం ఎగురవేయడం ఎమ్మిగనూరు రాజకీయాల్లో ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది. మాజీ తెలుగుదేశం పార్టీ నాయకులు మాచాని నాగప్ప కుమారుడైన మహేష్ కుమార్, ఆయన కోడలు మాచాని సునీత ఇద్దరూ ప్రజల ఆశీర్వాదంతో ఒకేసారి విజయం సాధించి మున్సిపల్ కౌన్సిల్‌లో అడుగుపెట్టబోతున్నారు. సునీత చైర్‌పర్సన్ బాధ్యతలు చేపట్టనుండగా, మహేష్ కుమార్ 37వ వార్డు కౌన్సిలర్‌గా ప్రజాసేవకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా మాచాని మహేష్ కుమార్, మాచాని సునీత మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఇద్దరినీ భారీ మెజారిటీలతో గెలిపించిన ఎమ్మిగనూరు పట్టణ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని బాధ్యతగా నెరవేర్చేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. పదవులు తమకు



అలంకారం కాదని, ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావిస్తామని పేర్కొన్నారు.

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వార్డులోని సమస్యలతో పాటు పట్టణంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ విజయానికి సహకరించిన కూటమి ప్రభుత్వ పెద్దలకు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డా. బీవీ జయనాగేశ్వర రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మున్సిపల్ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఎఫెక్ట్ పడిందా.

అభిమానులు,కార్యకర్తలు ఓటింగ్ కు దూరమయ్యారా. వైసిపి ముందంజా,కూటమి వెనుకబడిన కారణం ఇదేనా. నాయకుల సమన్వయ లోపమా,డబ్బు ప్రభావమా,రిజర్వేషన్ ప్రభావమా. అధిష్టానం ఆలోచించకుంటే కూటమికి డ్యామేజ్ జరగనుందా. ప్రజలు,అభిమానుల్లో చెదిరిపోని" భూమా" బ్రాండ్.



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 4 (నంది పత్రిక) రాష్ట్రంలో భూమా కుటుంబం అంటేనే ఒక బ్రాండ్.అభిమానులు,ప్రజలు,కార్యకర్తలకోసం ఎంతదూరమైన వెళ్లి భరోసా కల్పించే నాయకులంటే భూమా కుటుంబం అని చెప్పుకొస్తున్నారు.అధికారం ఉన్నా లేకపోయినా సమస్య వస్తే వారి వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయడమే వారి రాజకీయం.పదవులు ఇచ్చినా ఇవ్వకపోయినా అధిష్టానం ఆదేశాలు శిరసావహిస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో ఉన్నా నాయకుల సమన్వయం లేకపోవడంతో సైలెంట్ గా ఉండడంతో అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. నాయకుడు సైలెంట్ గా ఉండడంతో మున్సిపల్ ఎన్నికల్లో తమ నాయకుడు ప్రచారాల్లో పాల్గొనకపోవడంతో అభిమానులు సైతం ఎన్నికల్లో దూరంగా ఉండడంతో వైసిపి కి కలిసివచ్చింది అని తెలుస్తోంది.కూటమి అధికారంలో ఉంది ద్వితీయ స్థానంలో పడిపోవడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది.విపరాల్లోకి వెళితే నంద్యాల భూమా కుటుంబంలో వారసుడుగా భూమా బ్రహ్మానందరెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు.బాబాయ్ భూమా నాగిరెడ్డి వెంట తిరుగుతూ మంచి వ్యక్తిగా,సౌమ్యుడుగా,వివాదాలకు దూరంగా ఉంటూ మంచి పేరు తెచ్చుకున్నారు.విధి వక్రీకరించి చదంతో గుండె పోటుతో భూమా నాగిరెడ్డి మృతిచెందడంతో ఉప ఎన్నికల్లో భూమా బ్రహ్మానందరెడ్డి పోటీ చేయడంతో ఎమ్మెల్యే గా గెలుపొందారు.గెలిచిన కొన్నేళ్లలో నంద్యాలలో పలు అభివృద్ధి పనులు చేసి ప్రజలకు,అభిమానులకు, కార్యకర్తలకు ఇబ్బందులు పడకుండా సమస్యలు పరిష్కరించి మంచి పేరు తెచ్చుకున్నారు.2019 ఎన్నికల్లో పోటీ చేసినా వైసీపీ ప్రభంజనం లో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు నాయకులు ఓటమి పాలయ్యారు.నటి నుంచి నేటి వరకు పదవులు రాకపోయినా అధిష్టానం ఆదేశాలు శిరసావహిస్తూ పార్టీకి సేవలు చేస్తూ వచ్చారు.2024 ఎన్నికల్లో భూమా కు పార్టీ టికెట్టు ఇస్తుందని అందరూ సంబర పడ్డారు.తమ నాయకుడికి సీటు వస్తుందని భారీ మెజారిటీ వచ్చేందుకు కృషిచెద్దామని అనుకున్నారు.అధిష్టానం ఎవరు ఊహించని విధంగా మైనార్టీ నాయకునికి ఇవ్వడం కూటమి నియమ నిబంధనల ప్రకారం టికెట్ రాకపోయినా పార్టీ అభ్యర్థి విజయానికి కృషిచేయాలని చెప్పడంతో అభ్యర్థి విజయానికి కృషి చేశారు.పార్టీ అధికారంలోకి వచ్చినా స్థానిక నేతలు సమన్వయం లోపించడం ఏ కార్యక్రమానికి పిలుపు లేకపోవడంతో సైలెంట్ గా ఉండిపోయారు.ఇటీవల మున్సిపల్ ఎన్నికలో చైర్మెన్ గా పోటీ చేయాలని అభిమానులు పట్టుబట్టిన,అధిష్టానం మేరకే నడుచుకుంటానని తేల్చిచెప్పారు.ఎన్నికల్లో స్థానిక నేతలు కలుపుకోకపోవడంతో ఎన్నికల ప్రచారానికి దూరం కావడంతో అభిమానులు సైతం ఓటింగ్లో పాల్గొనలేదని తెలుస్తోంది.భూమా దూరం కావడంతో వైసిపి కి లాభం చేకూరిందని అభిమానులు చెప్పుకోవడం విశేషం.భూమా ప్రచారంలో పాల్గొని ఉంటే కూటమి ప్రభుత్వానికి లాభం చేకూరిందేదని తెలుస్తోంది.ప్రధానంగా కూటమికి భూమా ప్రభావం భారీగా పడిందని చర్చించుకోవడం విశేషం.అధిష్టానం ఇప్పటికైనా అందరూ నాయకులతో సమన్వయం లేకపోతే వచ్చే ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే.మున్సిపల్ ఎన్నికలు ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు.

ఉపాధి హామీ కూలీ కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందజేత

హన్మకొండ నవంబర్ 04 ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సల్ల సమ్మయ్య ఉపాధి హామీ పథకం పనుల్లో నిమగ్నమై ఉండగా ప్రమాదవశాత్తు మరణించిన నేపథ్యంలో, వారి కుటుంబానికి ప్రభుత్వం తరఫున మంజూరైన రూ. 2 లక్షల ఆర్థిక సహాయం చెక్కును వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న సమ్మయ్య మరణం బాధాకరమని, ఆయన కుటుంబానికి ఈ కష్టకాలంలో అండగా ఉండటంతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అందిన ఈ ఆర్థిక సహాయం కొంతవరకు తోడ్పాటుగా నిలుస్తుందని పేర్కొన్నారు.బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టకాలంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోశాల వెంకన్న, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఈగ దామోదర్, ఏఎంసీ మాజీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తూల్ల రవి, పలువురు సీనియర్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.



మాధవ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కుటుంబాన్ని సన్మానించిన 48 వ వార్డు కార్పొరేటర్

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్ కమ్మరి పార్వతమ్మ



కర్నూల్ సిటీ నంది పత్రిక మాధవినగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు మర్యాదపూర్వక సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో పాణ్యం శాసనసభ్యులు, నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ని, నందికొట్కూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి గౌరు వెంకట రెడ్డి ని, మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన 48వ వార్డు కార్పొరేటర్ యస్. రాఘవేంద్ర,ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ కలిశారు ఈ సమావేశంలో 48వ వార్డు ఇన్చార్జి నాగేశ్వరరావు , టీడీపీ కార్యకర్తలు ఇమ్మానియేల్ (గిద్దయ్య), గాంధీ, ప్రకాశం, అయ్యన్న, పర్ష తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు మెడికల్ కాలేజీలో "సుస్థిర ఆహార విధానాలపై విద్యార్థులకు అవగాహన"

"ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల పై విద్యార్థులచే ప్రతిజ్ఞ"

అడిషనల్ డీఎంఈ & మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా. కె.చిట్టి నరసమ్మ



కర్నూల్ సిటీ నంది పత్రిక ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పోషకాహారం, మంచి ఆహారపు అలవాట్లు ఎంతో అవసరమని, వైద్య విద్యార్థులు తమ జీవితాల్లో వీటిని పాటించడంతో పాటు ప్రజల్లో కూడా అవగాహన కల్పించాలని అడిషనల్ డిఎంఈ & మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా. కె.చిట్టి నరసమ్మ విద్యార్థులకు సూచించారు. ఆరోగ్య పరిరక్షణతో పాటు ప్రకృతి వనరుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.బుదవారం బ్రిక్స్ సస్టైనబుల్ లైఫ్ స్టైల్ వీక్(బ్రిక్స్ సూస్తాయినబుల్ లిఫెస్టైల్ వీక్ కార్యక్రమంలో భాగంగా కర్నూలు మెడికల్ కాలేజీలోని విద్యార్థుల హాస్టల్ మరియు న్యూ లెక్చరర్ గ్యాలరీ యందు "సుస్థిర ఆహార విధానాలను అలవర్చుకుందాం" అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పోషకాహారం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించి, వారిచే ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో 1)పోషక విలువలున్న సమతుల ఆహారాన్ని తీసుకోవడం. 2)చిరుధాన్యాలు (మిల్లెట్స్) మరియు స్థానిక ఆహార పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వడం.3)తాజా, కాలానుగుణ పండ్లు, కూరగాయలను ఆహారంలో భాగం చేసుకోవడం.4)ఆహార వృథాను అరికట్టి, ఆహారాన్ని గౌరవించడం.5) పర్యావరణ పరిరక్షణకు దోహదపడే సుస్థిర ఆహార విధానాలను పాటించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. పేర్కొన్నారు.బ్రిక్స్ సస్టైనబుల్ లైఫ్ స్టైల్ వీక్ కార్యక్రమ నోడల్ ఆఫీసర్,అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

కార్పొరేషన్, మున్సిపల్ మరియు నగర పంచాయతీ ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా ప్రజల తీర్పుకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నామని తెలుగుదేశం పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు.

కర్నూలు మేయర్ విజయ ప్రత్యూష కి
ఎమ్మిగనూరు మున్సిపల్ చైర్ పర్సన్ మాచాని సునీత కి
గూడూరు నగర పంచాయతీ చైర్పర్సన్ సునీత బాయి కి
ఆదోని మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న కి హృదయపూర్వక శుభాకాంక్షలు



కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు జిల్లాలో నిన్న వెలువడిన కార్పొరేషన్, మున్సిపాలిటీ మరియు నగర పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ ఫలితాలు కూటమి ప్రభుత్వ పారదర్శక పాలనకు, అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న తెలుగుదేశం పార్టీకి ప్రజలు ఇచ్చిన ఘనమైన తీర్పు అని ఆమె పేర్కొన్నారు. కర్నూలు మినిస్టర్ టీజీ భరత్ పార్లమెంట్ సభ్యుడు నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి , కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి , విష్ణువర్ధన్ రెడ్డి , ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి.జయనాగేశ్వర్ రెడ్డి మరియు ఆదోని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.వి.మీనాక్షి నాయుడు సంపూర్ణ సహకారం, నాయకత్వంతోనే కర్నూలు కార్పొరేషన్, ఎమ్మిగనూరు మున్సిపాలిటీ, గూడూరు నగర పంచాయతీ పరిధిలో తోపాటు ఆదోనిలో కూడా ఈ అద్భుతమైన ఫలితాలు సాధించడం సాధ్యమైందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కేంద్రమైన కర్నూలు కార్పొరేషన్‌లో మన అభ్యర్థులు ఘన విజయం సాధించి కార్పొరేషన్‌ను కైవసం చేసుకోవడం ఎంతో సంతోషకరమని, కర్నూలు నగర సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాబోయే రోజుల్లో పాలన సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని గూడూరు నగర పంచాయతీలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు జయకేతనం ఎగరవేశారని, ఎమ్మిగనూరు లో కూడా స్థానిక ప్రజలు మన పార్టీ అభ్యర్థులకు బ్రహ్మరథం పట్టి విజయాన్ని కట్టబెట్టారని హర్షం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ఆదోని మున్సిపాలిటీ పరిధిలో విజయం సాధించిన జనసేన పార్టీ రెబల్ అభ్యర్థి, మల్లప్ప సతీమణికి స్వప్న కి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన తీర్పును మనస్ఫూర్తిగా గౌరవిస్తున్నామని ప్రకటించారు.ఈ విజయం కేవలం నాయకులది మాత్రమే కాదని, రాత్రింబవళ్లు శ్రమించిన పార్టీ కార్యకర్తలు, నాయకులు మరియు కూటమి శ్రేణుల కష్టానికి దక్కిన ప్రతిఫలమని గుడిసె ఆది కృష్ణమ్మ కొనియాడారు. మనపై నమ్మకంతో ఈ ఘన విజయాన్ని అందించిన కర్నూలు జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, గెలిచిన స్థానాల్లో ప్రజా సంక్షేమం మరియు స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధుల నిర్వహణలో పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి





- ఎన్నికల కమిషన్ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ విధులు నిర్వహించాలి

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. ఏ. సిరి

కర్నూలు సిటీ నందిపత్రిక ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధుల నిర్వహణలో పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, ఎన్నికల కమిషన్ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. ఏ. సిరి పోలింగ్ సిబ్బందికి సూచించారు.బుధవారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి సి. బెళగల్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గూడూరు మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోడుమూరు మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్నికల విధులకు హాజరైన అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు నిర్దేశిత సమయానికి చేరుకునేలా రవాణా ఏర్పాట్లు చేయాలని, బస్సులు, ఇతర వాహనాల ద్వారా సిబ్బంది సకాలంలో గమ్యస్థానాలకు చేరుకునేలా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఎదురైనా, ముఖ్యమైన సమాచారం లేదా మార్పులు చోటుచేసుకున్నా వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు కంట్రోల్ రూమ్ సిబ్బంది తక్షణమే స్పందించి, అవసరమైన సమాచారం, సహాయ సహకారాలు అందించాలని స్పష్టం చేశారు. రూట్ ఆఫీసర్లు తమకు కేటాయించిన పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు సమాన దూరం ఉండేలా రూట్‌లను సమన్వయం చేసుకోవాలని, రూట్ ఆఫీసర్లు, సెక్టోరల్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, మైనింగ్ శాఖ అధికారి నాగిని, సివిల్ సప్లై డి. ఎం జయంతి, సి. బెలగల్ తహశీల్దార్ వెంకటలక్ష్మి, గూడూరు మండలం తహశీల్దార్ వెంకటేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ గుర్తుకే ఓటు వేసి గెలిపించవలసిందిగా కోరుతూ టిడిపి ఎంపిటిసి అభ్యర్థి: మేకల తిమ్మప్ప



ఎమ్మిగనూరు నవంబర్ 4 నంది పత్రిక ఎమ్మిగనూరు మండలం చెన్నాపురం ఎంపీటీసీ2 అభ్యర్థిగా టిడిపి పార్టీ తరఫున పోటీచేసిన మేకల తిమ్మప్ప అనే నేను చెన్నాపురం ,నక్కల మిట్ట, బోడబండ గ్రామాలను అభివృద్ధి చేస్తానని హామీ ఇస్తున్నాను. కాబట్టి సైకిల్ గుర్తుకు ఓటు వేసి నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసిన మేయర్ గా విజయం సాధించిన విజయ ప్రత్యూష



కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా విజయం సాధించిన బొల్లెద్దుల విజయ ప్రత్యూష ఎంపీ బస్తిపాటి నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు...నగరంలో ని ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసిన ప్రత్యూష , ఎన్నికల్లో తన గెలుపుకు సహకరించిన ఎంపీ నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు...ఈ సందర్భంగా నగర అభివృద్ధి, భకవిష్యత్తు కార్యాచరణ పై ఇరువురు చర్చించారు.

కార్పొరేషన్ నగర పంచాయతీ ఎన్నికల ప్రచారంలో సహకరించిన కూటమి నాయకులు కృతజ్ఞతలు

కోడుమూరు బీజేపీ నాయకులు వేల్పుల గోపాల్



కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ కర్నూలు వేల్పుల గోపాల్ మాట్లాడుతూ నగరంలో కార్పొరేషన్ 51 52 53 54 వార్డులలో కూటమి మేయర్ అభ్యర్థి బోల్లేద్దుల ప్రత్యూష గెలుపు కోసం కూటమి భారతీయ జనతా పార్టీ తెలుగుదేశం జనసేన పార్టీల నాయకులు వార్డులలో విస్తృత ప్రచారంలో కర్నూలు పార్లమెంట్ యం పి బస్తీపాటి నాగరాజు కోడుమూరు అసెంబ్లీ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొని గడప గడపకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న పతకాలను ప్రజలకు వివరించుటం ఈ గెలుపు కోసం నిరంతరం కూటమి భారతీయ జనతా పార్టీ తెలుగుదేశం జనసేన పార్టీల కూటమి నాయకులు ఏక గ్రీవం అయిన శేఖర్ అభ్యర్థులు జయచంద్ర ఓబులేసు రమేష్ ప్రతాప్ రెడ్డి యస్ కె భాష రాఘవఆచారి వెంకటేశ్వర్లు ప్రసాద్ బెస్తఈరన్న తదితర నాయకులకు కార్యకర్తలకు పేరుపేరునా శిరస్సు వంచి ధన్యవాదములు తెలుపుతునా మన్నారు.

బుగ్గరాముడు సేవలకు..కోడలికి వరించిన అదృష్టం.





కోడలి విజయం కోసం ...మామ ఇంటింటింటి ప్రచారం అదరహో.

బుగ్గరాముడు మనవడికి సైకిల్ కానుకగా ఇచ్చిన మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్.

బుగ్గరాముడు కుటుంబాన్ని అభినందించిన మంత్రి ఫరూక్.

నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 4 (నంది పత్రిక) నాయకులను నమ్ముకుంటే విజయమే కాదు కానుకలు వస్తాయని రుజువైంది.టీడీపీ పార్టీని ,మంత్రి నీ నమ్ముకున్న బుగ్గరాముడు కుటుంబానికి విజయంతో పాటు,మనవడు తేజేశ్వన్ కుమార్ కు సైకిల్ ను మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్ బహుమతిగా ఇచ్చారు.ప్రజలకు సేవ చేసేవారికి విజయం ద్వారా ప్రతిఫలం లభిస్తుందని బుగ్గ రాముడు కుటుంబాన్ని మంత్రి కొనియాడారు.మున్సిపల్ ఎన్నికల్లో 51 వార్డ్ టీడీపీ అభ్యర్థిగా బుగ్గరాముడు కోడలు తాటికొండ విజయ నిలబడి 194 ఓట్ల మెజారిటీతో గెలుపొందింది.ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం బుగ్గ రాముడు కుటుంబ సభ్యులు ,కార్యకర్తలు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.మంత్రికి పూల మాలలు,శాలువాతో ఘనంగా సన్మానించి అభిమానాన్ని చాటుకున్నారు.కుటుంబంలో బుగ్గ రాముడు మనవడిని ఆప్యాయంగా దగ్గరికి తీసుకొని చాక్లెట్ ఇచ్చి, షేక్ హ్యాండ్ ఇచ్చి హాయ్ అని పలకరించారు.ముద్దుగా ఉన్న పిల్లవాడికి ,ఆ కుటుంబం ఊహించని విధంగా కొత్త సైకిల్ ను కానుకగా ఇవ్వడంతో,క్షణాల్లో జరిగిన సంఘటన ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.బుగ్గరాముడు,ఆయన కుమారుడు మహేష్ దాదాపు కొన్ని ఏళ్లుగా వైఎస్సార్ నగర్, నందమూరి నగర్ ప్రజలు కు సుపరిచితులు.ఎస్ రెండు ప్రాంతాల్లో అధికంగా పేద ప్రజలు జీవనం సాగిస్తున్నారు.పనులు చేసుకుంటేనే జీవనం సాగే ఆ ప్రజలకు బుగ్గ రాముడు కుటుంబం పై అభిమానం పెరిగింది.ప్రజలు ఇంత ఆప్యాయంగా ఆదరించడంతో వారి కాస్త సుఖాలను పాలుపంచుకునే వారు.వైఎస్సార్ నగర్,నందమూరి నగర్ ప్రాంతాల్లో రోడ్లు,కాల్వలు సరిగా లేకపోవడం,గుంతలు ,సరైన రోడ్లు లేని ప్రాంతాల్లో సొంత నిధులతో గుంతలు లెవెలింగ్ చేయించేవారు.దేవాలయాలకు,వృద్ధులకు,పెళ్ళిళ్ళు ,పండుగలు,విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేవారు.ఒకవైపు పార్టీ కార్యక్రమాల్లో తనదైన శైలిలో సేవలు చేస్తూ,ఇటు నమ్ముకున్న ప్రజలకు చేతనైన సహాయం చేసేవారు.

తక్కువ కాలంలో ఎక్కువ ప్రజాదరణ పొందారు.మున్సిపల్ ఎన్నికల్లో జరిగిన తాతగా అందరికీ తెలిసిందే.పార్టీ పెద్దలు చెప్పిన విధంగా 51 వార్డులో కోడలు విజయం టీడీపీ పెదాలు సీటు ఇచ్చారు.పెద్దల మాటలు జవదాట కుండా విజయమే విజయ లక్ష్యంగా బరిలోకి దిగారు.కుటుంబసభ్యులు,ప్రజల ఆశీర్వాదాలతో ప్రచారంలో సైరా అనిపించారు.కోడలు విజయ ,విజయానికి మామగా గడప,గడపకు ఇంటింటికి తిరుగుతూ ప్రచారానికి ఊపుతెప్పించారు.ప్రజలు హారతులు,పూల వర్షం కురిపించి నీరాజనాలు పలికారు.హోరా హోరీ పోరులో ప్రజల ఆశీర్వాద బలంతో 194 ఓట్ల మెజారిటీతో కోడలిని గెలిపించుకున్నారు.ప్రస్తుత సమాజంలో కోడలి విజయం కోసం కష్టపడి,ఖర్చుకు వెనుకాడకుండా మామ విజయాన్ని అందించడం గొప్ప విషయంగా భావిస్తున్నారు.ఆ ఇంటి లక్ష్మీ మా ఇంటి లక్ష్మీగా భావించామని,మా కుటుంబంలో ఏ లోటు లేకుండా ఇలాంటి కోడలు లభించడం మా అదృష్టమని పేర్కొన్నారు.విజయాన్ని అందించిన వార్డ్ ప్రజలకు మంత్రి ఫరూక్,ఆయన కుమారులు ఫిరోజ్,ఫయాజ్,చైర్మెన్ డాక్టర్ బాబన్ కు టీడీపీ పెద్దల కు అభినందనలు తెలియజేశారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి...

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి





భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 4 నంది పత్రిక పశ్చిమగోదావరి జిల్లాలో ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వెల్లడించారు. బుధవారం భీమవరంలోని ఎస్ఆర్కేఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 20 జెడ్పీటీసీ స్థానాలకు, 340 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణ కోసం సుమారు 7,500 మంది అధికారులు, సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీసీ కెమెరాలు, వీడియో కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 5వ తేదీ గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఓటర్లందరూ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములై జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి



రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా



భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 4 నంది పత్రిక ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం అమరావతి సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి భీమవరంలోని జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి పి. గ్లోరియా, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ , ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సామగ్రిని నిర్దేశించిన మార్గాల్లోనే తరలించాలని, సామగ్రి తరలింపు సమయంలో తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు

అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు.





పెద్దవాగుకు వరద ప్రమాదం

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రజలను యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

కల్వర్టులు, వాగులు కాజ్ వే లు దాటాకుండా ప్రమాద హెచ్చరికలు, బారికేడ్లు ఏర్పాటు చేయాలి

బోట్లు సిద్ధం చేయాలి, రహదారి మార్గాలు దెబ్బతిన్న గ్రామాలకు బియ్యం నిత్యావసర సరుకులు అందించాలి

ఎక్కడా ఎటువంటి ప్రాణ నష్టం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

వరదలపై అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి టెలి కాన్ఫరెన్స్

ఏలూరు బ్యూరో చీఫ్, నవంబర్, 4 నంది పత్రిక : వేలేరుపాడులోని పెద్దవాగు కు తెలంగాణా నుండి పెద్దఎత్తున వరదనీరు దిగువకు రావడంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ముంపు గ్రామాల ప్రజలను యుద్ధప్రాతిపదికన సురక్షిత ప్రాంతాలకు తరలించి, సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో మురసు తుఫాన్ కారణంగా భారీ వర్షాలు, వరద పరిస్థితి, నష్ట నివారణకు తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పెద్దవాగుకు పెద్దఎత్తున వరద నీరు చేరుకుందని, దీని కారణంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వేలేరుపాడు, కమ్మరిగూడెం, ఒంటిబండ, కోయమాదారం, కొత్తపుచీరాల, పాతపుచీరాల, అల్లూరినగర్, సొండిగొల్లగూడెం, వసంతవాడ, గుళ్లవాయిలతో పాటు పలు గ్రామాలకు ముంపు ప్రమాదం ఉన్నందున ప్రజలను అత్యవసరంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని, గర్భిణీలు, వయోవృద్ధులు, పిల్లలు, దివ్యాంగులను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలన్నారు. ముంపు గ్రామాలలోని ప్రజలను అత్యవసరంగా సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని, బోట్లు సిద్ధం చేయాలనీ, యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కల్వర్టులు, వాగులు కాజ్ వే లు దాటాకుండా ప్రమాద హెచ్చరికలు, బారికేడ్లు ఏర్పాటుచేసి ప్రజలను అప్రమత్తం చేసేందుకు సిబ్బందిని నియమించాలన్నారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ నష్టం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నదులు, చెరువులు, కాలువలలోనికి ప్రజలు వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది అత్యవసరంగా సహాయక కార్యక్రమాలపై ముఖ్యంగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. గర్భిణీలను దగ్గరలోని పిహెచ్సి లకు తరలించాలని, , వయోవృద్ధులు, పిల్లలు, దివ్యాంగులను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, రెవిన్యూ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పశ్చిమగోదావరిలో యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

భారీ వర్షంలోనూ అధికారులు, సిబ్బంది నిర్విరామ కృషి ప్రశంసనీయం

ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

భీమవరం బ్యూరో చీఫ్, నవంబరు 4: నంది పత్రిక ఆర్నబ్ తుఫాను కారణంగా ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని పశ్చిమగోదావరి జిల్లాలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఆర్నబ్ తుఫాను కారణంగా ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని పలు జిల్లాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పశ్చిమగోదావరి జిల్లాలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరణ పనుల పర్యవేక్షణా బాధ్యతలను ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటికి అప్పగించారు. ఈ సందర్భంగా సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేసే అంశంపై విద్యుత్ శాఖ అధికారులతో సిఎండి శివశంకర్ లోతేటి బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇంధనశాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలోని వివిధ విద్యుత్ సంస్థల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విద్యుత్ సరఫరా పునరుర్ధరణ పనులను వేగవంతం చేశామని వివరించారు. పశ్చిమగోదావరి జిల్లాలో భారీ వర్షాలు, బలమైన గాలి కారణంగా 33కెవి సబ్- స్టేషన్లు-98, 33కెవి ఫీడర్లు- 67, విద్యుత్ స్తంభాలు-8,859 11కెవి ఫీడర్లు-475, 516 ట్రాన్స్ ఫార్మర్లు, 755 కి. మీ. మేరకు విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో జిల్లాలోని 6 పట్టణాలు, 20 మండలాల్లోని 409 గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో వినియోగదారులకు వీలైనంత తక్కువ సమయంలో విద్యుత్ సరఫరాను అందించాలనే ధ్యేయంతో భారీ వర్షాన్ని, బలమైన గాలిని సైతం లెక్కచేయకుండా అధికారులు, సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను చేపట్టడంతో త్వరితగతిన పనులను పూర్తి చేసేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. బుధవారం సాయంత్రానికి 6 పట్టణాలు, 409 గ్రామాలకూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఇక జిల్లాలో 17 వేల అక్వా సర్వీసులకు సరఫరాలో అంతరాయం ఏర్పడగా 14వేల సర్వీసులకు సరఫరాను పునరుద్ధరించడం జరిగిందన్నారు. మిగిలిన అక్వా సర్వీసులతోపాటు వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు కూడా ఒకట్రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో సరఫరాను పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సరఫరాను పునరుద్ధరించేందుకు గత వారం రోజులుగా భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిర్విరామంగా కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఎక్కడైడా గృహ విద్యుత్ సర్వీసులకు విద్యుత్ సరఫరా లేనట్లయితే సరఫరా పునరుద్ధరణ కోసం వినియోగదారులు కంట్రోల్ రూమ్ మొబైల్ నంబరు: 9490610152కు కాల్ చేయవచ్చని తెలియజేశారు. వెంటనే సరఫరా పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.





తుఫాన్ల కారణంగా దెబ్బతిన్న పోలింగ్ కేంద్రాల స్థానంలో ప్రత్యామ్నాయ కేంద్రాల ఏర్పాటు

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు : జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 4 నంది పత్రిక పశ్చిమగోదావరి జిల్లాలో అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంతో కొన్ని మండలాల్లో దెబ్బతిన్న పోలింగ్ కేంద్రాల స్థానంలో ప్రత్యామ్నాయంగా కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అథారిటీ చదలవాడ నాగరాణి తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుఫాన్ల కారణంగా కొన్ని మండలాల్లోని ప్రస్తుత పోలింగ్ కేంద్రాల భవనాలు దెబ్బతినడంతో సంబంధిత రిటర్నింగ్ అధికారులు ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదిస్తూ నివేదికలు సమర్పించారని తెలిపారు.సంబంధిత అధికారుల ప్రతిపాదనలను, ప్రస్తుత పరిస్థితులను పరిశీలించి, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా దెబ్బతిన్న పోలింగ్ కేంద్రాల స్థానంలో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.అత్తిలి మండలం: పోలింగ్ కేంద్రం నంబరు 31కు సంబంధించి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల దక్షిణ వైపు భవనంలోని నాలుగో గదిలో కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. భీమవరం మండలం: పోలింగ్ కేంద్రాల నంబర్లు 73, 74, 75లకు ప్రత్యామ్నాయంగా తుందుర్రులోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాల, గ్రామ సచివాలయం, ఎంపీపీ ప్రాథమిక పాఠశాల పశ్చిమ వైపు భవనంలో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మొగల్తూరు మండలం: కాళీపట్నం వెస్ట్లోని రైతు భరోసా కేంద్రం సమావేశ మందిరం, స్వర్ణ గ్రామం, అంగన్వాడీ కేంద్రం, పెరుపాలెం దక్షిణ ప్రాంతంలోని స్వర్ణ గ్రామం, కేపీ పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పిప్పల్లవారితోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వివేకా ఇంగ్లీష్ మీడియం పాఠశాల తదితర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. పెనుమంట్ర మండలం: పెనుమంట్ర విశాల్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, తహసీల్దార్ కార్యాలయ హాల్, గ్రంథాలయ హాలు, వేలగలవారిపాలెం గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం తదితర ప్రాంతాల్లో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఉండి మండలం: శ్రీ గాంధీ మెమోరియల్ పాఠశాల, వీఆర్వో భవనం, ఎంపీపీ ప్రధాన పాఠశాల కొండ్రుతుపేట, ఎంపీడీవో కార్యాలయంలోని ఎంఈఓ గది, ఉపాధి హామీ పథకం గదుల్లో ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.. వీరవాసరం మండలం: వీరవాసరం ఎం.ఆర్.కె. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎల్ ఆకారపు భవనంలో, ఉత్తర పశ్చిమ వైపు నేల అంతస్తులోని నాలుగు గదుల్లో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. సంబంధిత రిటర్నింగ్ అధికారులు ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టి, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికలను ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు



ఎంఈఓ గది, ఉపాధి హామీ పథకం గదుల్లో ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు..

ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ఉండి బ్యూరో చీఫ్ నవంబర్ 4 నంది పత్రిక ఉండి మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం ఉండి మండలంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ, సిబ్బంది కేటాయింపు, రవాణా ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సామగ్రి పంపిణీలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 5వ తేదీ గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుందని, ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.



87 మున్సిపాలిటీలు / నగర పంచాయతీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్లలో

పరోక్ష ఎన్నికలకు షెడ్యూల్ ఖరారు

ఈ నెల 18 లోపు ఎన్నికైన మేయర్లు, చైర్పర్సన్లు, వార్డు సభ్యులకు ఎన్నికల నోటీసు జారీ... నవంబర్ 23 వ తేదీన డిప్యూటీ మేయర్, వైస్ చైర్పర్సన్ల పరోక్ష ఎన్నికల నిర్వహణ

పరోక్ష ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

విజయవాడ, బ్యూరో చీఫ్ నవంబర్ 4 నంది పత్రిక రాష్ట్రంలో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా 87 మున్సిపాలిటీలు / నగర పంచాయతీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్లలో పరోక్ష ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ ను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా విడుదల చేశారు.ఈ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 18వ తేదీ లోపు ఎన్నికల నోటీసు జారీ చేయనున్నారని, అనంతరం 23వ తేదీన పరోక్ష ఎన్నికలు నిర్వహించనున్నారని ఆయన తెలిపారు.మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు వైస్ చైర్పర్సన్ ఎన్నికలు, మున్సిపల్ కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ ఎన్నికలు పరోక్ష పద్ధతిలో నిర్వహించనున్నారు.ఆయా స్థానిక సంస్థలకు ఎన్నికైన వార్డు సభ్యులు, చైర్పర్సన్లు, మేయర్ లు ఎన్నికైన ఒక వార్డు సభ్యున్ని డిప్యూటీ మేయర్ గా, వైస్ చైర్పర్సన్ గా ఎన్నుకోనున్నారని ఎన్నికల కమిషనర్ పునేఠా తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా నిర్ణీత తేదీ లోపు ఎన్నికల నోటీసు జారీ చేసి, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత ఎన్నికల అధికారులకు సూచించారు

ఎన్నికల నిబంధనలు, చట్టపరమైన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నికల కమిషనర్ పునేఠా అన్నారు

ఎన్నికల షెడ్యూల్ వివరాలు:

మున్సిపాలిటీలు / నగర పంచాయతీలు: 87

మున్సిపల్ కార్పొరేషన్లు: 13

ఎన్నికల నోటీసు జారీ: 18.11.2026 లోపు

పరోక్ష ఎన్నికల నిర్వహణ: 23.11.2026

ఏదైనా అనివార్య కారణాల వల్ల నవంబర్ 23 వ తేదీన పరోక్ష ఎన్నికలు నిర్వహించకపోతే ఆ ఎన్నికల ప్రక్రియను నవంబర్ 24 తేదీన పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సంబంధిత అధికారులకు సూచించారు.మొత్తంగా 100 పట్టణ స్థానిక సంస్థల్లో పరోక్ష ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈ షెడ్యూల్ కీలకంగా మారనుందని ఈ ఎన్నికలతో పట్టణ స్థానిక సంస్థల్లో పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ మరింత ముందుకు సాగనుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సహకరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా పిలుపునిచ్చారు.



ఉపాధి కల్పన.. జల సంరక్షణ పనులపై

ప్రత్యేక దృష్టి సారించాలి

- గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాల పురోగతిని నిరంతరం పరిశీలించాలి,

- పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ ఐఏఎస్,

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, జల సంరక్షణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ ఐఏఎస్ సూచించారు. గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాల పురోగతిని నిరంతరం పరిశీలించాలని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఉపాధి పనులు, కూలీల హాజరు, జాబ్కార్డుల జారీ, మేట్ల శిక్షణ, జలసిరి పనులు, గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు ఈ సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నవంబర్ 3 నాటి నివేదిక ప్రకారం రాష్ట్రంలోని 12,760 గ్రామ పంచాయతీలకుగాను 12,280 పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా 5,02,697 మంది కూలీలు పనులకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇంకా పనులు ప్రారంభించని పంచాయతీలపై దృష్టి సారించి, ఉపాధి కోరే కూలీలకు పనులు అందుబాటులో ఉంచాలని సూచించారు. జాబ్కార్డుల జారీకి సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించాలని, కూలీల హాజరు, పనిదినాల నమోదును పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. జలసిరి కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 55,133 పనులు ప్రారంభించి, 14,121 పనులు పూర్తి చేసినట్లు కమిషనర్ తెలిపారు. వ్యవసాయ కుంటలు, ఊటకుంటలు, ఇంకుడు గుంతలు, బోర్వెల్ రీఛార్జ్ నిర్మాణాల పూర్తిపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. పశుగ్రాస సాగు, పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా సిద్ధం చేసేలా పురోగతిని పర్యవేక్షించాలని తెలిపారు.ములుగు జిల్లాలో 171 గ్రామ పంచాయతీలకుగాను 162 పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించామని, నవంబర్ 3న 7,465 మంది కూలీలు పనులకు హాజరయ్యారని జిల్లా అదనపు కలెక్టర్ ఎం. సంపత్ రావు కమిషనర్కు వివరించారు. పనులు ప్రారంభమైన పంచాయతీల్లో కూలీల సగటు హాజరు 46గా నమోదై, రాష్ట్ర సగటు 41 కంటే మెరుగ్గా ఉండటంపై కమిషనర్ జిల్లా అధికారులను అభినందించారు. జిల్లాలో ప్రారంభించిన వ్యవసాయ కుంటల పనులతోపాటు నవంబర్ 19 నాటికి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాల్సిన 254 నిర్మాణాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



చెకుముకి సైన్స్ సంబురాలు 2026 పోస్టర్ ఆవిష్కరణ

- విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలకు ప్రోత్సాహం..

- నాలుగు స్థాయిల్లో సైన్స్ సంబురాలు,

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'చెకుముకి సైన్స్ సంబురాలు2026'కు సంబంధించిన పోస్టర్ను రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహణ వివరాలను వెల్లడించారు. నవంబర్ 12న పాఠశాల స్థాయి, నవంబర్ 21న మండల స్థాయి, నవంబర్ 29న జిల్లా స్థాయి సైన్స్ సంబురాలు నిర్వహించనున్నారు. అనంతరం డిసెంబర్ 12, 13 తేదీల్లో మేడ్చల్లోని సీఎంఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్లో రాష్ట్ర స్థాయి సైన్స్ సంబురాలు

ఘనంగా జరగనున్నాయి.ఈ కార్యక్రమాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీసేలా సైన్స్ ప్రదర్శనలు, సైన్స్ మ్యాజిక్ షో, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, సైన్స్ కార్నివాల్ తదితర ఆసక్తికర కార్యక్రమాలు

ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థుల్లో మూఢనమ్మకాలను తొలగించి, ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడమే ఈ సంబురాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:- APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఉద్యాన పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

- ఆయిల్‌పామ్ రైతులు వేసవి ప్రారంభానికి ముందే అప్రమత్తంగా ఉండాలి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పి. కమలాకర్ రెడ్డి



నడికుడ, నవంబర్ 04, ఎల్‌నినో పరిస్థితులు, వాతావరణ మార్పులు, రాబోయే వేసవి తీవ్రత మరియు నీటి వనరుల కొరతను దృష్టిలో ఉంచుకొని ఉద్యాన పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ పంటలను సంరక్షించుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీ పి. కమలాకర్ రెడ్డి రైతులకు సూచించారు.నడికుడ మండలంలోని వరికోల్ గ్రామానికి చెందిన రైతు బొల్లం సమ్మిరెడ్డి ఆయిల్‌పామ్ క్షేత్రంలో పరకాల డివిజన్ ఉద్యాన శాఖ అధికారి ఏ. సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కేత్ బచావో అభియాన్ (ఖ్వవ్ ద్యీఎష్ఘుశీ ూఎష్ఘఅఘుఅ) కార్యక్రమంలో భాగంగా ఉద్యాన పంటల సాగు, ఆయిల్‌పామ్ పంటలో వేసవికాల యాజమాన్య పద్ధతులు, పంటల వైవిధ్యీకరణ మరియు ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), మామునూర్ శాస్త్రవేత్త డా. రాజు (గ్రామీణ సస్య రక్షణ) మాట్లాడుతూ, రైతులు వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలపై మాత్రమే ఆధారపడకుండా కూరగాయలు, పండ్ల తోటలు, సుగంధ ద్రవ్య పంటలు, పూల పంటలు, ఔషధ మరియు సుగంధ మొక్కలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ ఉద్యాన పంటలను సాగులో చేర్చుకోవాలని సూచించారు. పంటల మార్పిడి, అంతర పంటల సాగు, సమగ్ర సస్యరక్షణ, సేంద్రియ ఎరువుల వినియోగం, నీటి పొదుపు పద్ధతులను పాటించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకొని రైతుల ఆదాయాన్ని పెంచుకోవచ్చని వివరించారు. నేల ఆరోగ్య పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీ పి. కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ రైతులు రాబోయే వేసవి తీవ్రతతో పాటు ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయిల్‌పామ్ మొక్కలకు వేసవి తీవ్రత వల్ల నీటి ఎద్దడి, నేలలో తేమ తగ్గడం వంటి సమస్యలు తలెత్తకుండా జూన్ నెల వరకు నిరంతర తేమ అందేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మొక్కల చుట్టూ నాలుగు వైపులా స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందించడం, ముఖ్యంగా సాయంత్రం వేళల్లో నీటి తడులు ఇవ్వడం, మొక్కల మొదళ్ల చుట్టూ మల్చింగ్ చేయడం, పశువుల ఎరువును వినియోగించడం వంటి మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. మొక్కల మొదళ్ల చుట్టూ సేంద్రియ పదార్థాలతో నేలను కప్పడం ద్వారా నేలలో తేమ నిల్వ ఉండటంతో పాటు నేల ఉష్ణోగ్రత తగ్గి వేసవి వేడి ప్రభావం నుంచి మొక్కలను రక్షించవచ్చని వివరించారు. రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆయిల్‌పామ్ తోటలను ఆరోగ్యంగా కాపాడుకోవచ్చని తెలిపారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సాహక పథకం, అర్హత ప్రమాణాలు, మొక్కల సరఫరా, ప్రభుత్వ సబ్సిడీలు, డ్రిప్ ఇరిగేషన్ సదుపాయాలు మరియు రైతులకు అందుబాటులో ఉన్న ఆర్థిక సహాయం గురించి వివరించారు. ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమైన భూములు, తగిన నీటి వసతి కలిగిన రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుపై రైతుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన మొక్కల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను అనుసరిస్తే ఆయిల్‌పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా మంచి ఆర్థిక ప్రయోజనాలను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పరకాల డివిజన్ ఉద్యాన శాఖ అధికారి శ్రీ ఏ. సునీల్ కుమార్ మాట్లాడుతూ, మామిడి, జామ, బత్తాయి, నిమ్మ, దానిమ్మ వంటి పండ్ల తోటలతో పాటు మిరప, టమాట, వంగ, బెండ, ఆకుకూరలు వంటి కూరగాయల పంటలు, పసుపు, అల్లం వంటి సుగంధ ద్రవ్య పంటలు, పూల పంటలు మరియు ఇతర వాణిజ్య ఉద్యాన పంటల సాగు విధానాలను వివరించారు. రైతులు తమ భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవకాశాలను బట్టి అనువైన ఉద్యాన పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని తోటల్లో తేమ సంరక్షణ, మల్చింగ్, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి సమర్థ వినియోగం, మొక్కల సంరక్షణ వంటి మేలైన యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో రైతులకు ఉద్యాన పంటల సాగు ద్వారా అదనపు ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకోవడం, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం, ఆధునిక సాగు పద్ధతులను అనుసరించడం మరియు వేసవిలో పంటలను సంరక్షించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు తమ సందేహాలను అధికారులతో చర్చించి అవసరమైన సలహాలు, సూచనలు పొందారు.కార్యక్రమం అనంతరం ఉద్యాన శాఖ అధికారులు రైతులతో కలిసి సమీపంలోని మిరప, ఆయిల్‌పామ్ తోటలను సందర్శించి క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప పంటలో చేపట్టాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యం, నీటి తడుల నిర్వహణతో పాటు ఆయిల్‌పామ్ తోటల్లో వేసవి తీవ్రతను తట్టుకునేందుకు పాటించాల్సిన నీటి యాజమాన్యం, మల్చింగ్, మొక్కల సంరక్షణ పద్ధతులపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. రైతులు పంటల వారీగా శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వరికోల్ గ్రామ సర్పంచ్ శ్రీ దొగ్గల కుమారస్వామి, స్థానిక మాజీ వైస్ ఎంపీపీ, ఉప సర్పంచ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీ పి. కమలాకర్ రెడ్డి, కేవీకే మామునూర్ శాస్త్రవేత్త డా. రాజు (గ్రామీణ సస్య రక్షణ), పరకాల డివిజన్ ఉద్యాన శాఖ అధికారి శ్రీ ఏ. సునీల్ కుమార్, ఉద్యాన విస్తరణ అధికారి (నఙూ) శ్రీ బి. దేవేందర్, వ్యవసాయ విస్తరణ అధికారి (ూఙూ) శ్రీ ఎం. రామకృష్ణ, ఆయిల్‌పామ్ అధికారి శ్రీ భరత్ మరియు వివిధ గ్రామాలకు చెందిన ఆయిల్‌పామ్ రైతులు, ఇతర రైతులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సంపత్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



ఐనవోలు నవంబర్ 04 ఐనవోలు మండలం కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు పైండ్ల సంపత్ గారు ఇటీవల అనారోగ్యానికి గురై ప్రస్తుతం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు వారి నివాసానికి వెళ్లి సంపత్ గారిని పరామర్శించారు. ఈ సందర్భంగా సంపత్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన సమయంలో ఎలాంటి సహాయం కావాలన్నా తనకు తెలియజేయాలని సూచించారు. ప్రజా జీవితంలో గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకులను ఆప్యాయంగా పలకరించడం, వారి కష్టసుఖాల్లో తోడుగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్,సర్పంచ్ వాణి రవికుమార్, డిసిసి వైస్ ప్రెసిడెంట్ బుచ్చిరెడ్డి, సమ్మెట మహేందర్ గౌడ్, డీసీసీ సెక్రెటరీ రాయరాపు సాంబయ్య, ఎలీషా, నాగలక్ష్మి, లక్ష్మణ్ రావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం



భూపాలపల్లి నవంబర్ 04 భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేరా యువభారత్ (కేంద్ర ప్రభుత్వం) ఆధ్వర్యంలో జిల్లా యువజన అధికారి భూక్య సంజీవ్ గారి ఆదేశాల మేరకు వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా "వన్ నేషన్ వన్ ఎలక్షన్" అనే అంశంపై విద్యార్థులకు ఎలొక్యూషన్ (ఉపన్యాస) పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీల ద్వారా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల విధానం, జాతీయ అభివృద్ధిలో యువత పాత్ర వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా క్రీడల అధికారి రఘు గారు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఏ. రమణరావు గారు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మొహమ్మద్ రుక్సానా గారు పాల్గొన్నారు.పోటీలకు న్యాయనిర్ణేతలుగా డాక్టర్ కవిత గారు (ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్), డాక్టర్ చంద్రకళ గారు, డాక్టర్ లక్ష్మీనారాయణ గారు (ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల), రాధిక గారు (టీ.జీ.ఆర్.డబ్ల్యూ.సీ., ఏటూరునాగారం) వ్యవహరించారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను ప్రధానం చేయడం జరిగింది ఈ కార్యక్రమాన్ని మేరా యువభారత్ ప్రోగ్రాం ఆర్గనైజర్ వెల్దండ సురేష్ గారు సమన్వయం చేయగా, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.యువతలో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు, వక్తృత్వ నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు వికసిత్ భారత్ నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

రైతులకు బ్యాంకుల ద్వారా అవసరమైన ఆర్థిక సహాయ సహకారాలు అందించి ఉపశమనం కల్పించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి నవంబర్ 04 జిల్లాలో కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రభావిత మండలాల రైతులకు బ్యాంకుల ద్వారా అవసరమైన ఆర్థిక సహాయ సహకారాలు అందించి ఉపశమనం కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బ్యాంకు అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో ఎల్డిఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ జిల్లా స్థాయి రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కరువు పరిస్థితులు, రైతులకు బ్యాంకుల ద్వారా అందించాల్సిన సహాయక చర్యలు, పంట రుణాల పునర్వ్యవస్థీకరణ తదితర అంశాలపై సమీక్షించారు.రాష్ట్రంలో కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం కరువు ప్రభావిత మండలాలను గుర్తించిందని, జిల్లాలో కాటారం, మహాముత్తారం, మహాదేవపూర్, మల్హర్ రావు, కొత్తపల్లి గోరి మండలాలుగా ప్రకటించినట్లు ఆయన స్పష్టం చేశారు.కరువు ప్రభావిత ప్రాంతాల్లోని రైతులకు ఉపశమనం కల్పించేందుకు ఎస్ఎల్‌బీసీ (గాదీజ), ఆర్‌బీఐ (=దీ×) మార్గదర్శకాల ప్రకారం పంట రుణాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని సూచించారు. కరువు ప్రభావిత మండలాల రైతులకు 12 నెలల మారటోరియం కల్పించడంతో పాటు రుణాల చెల్లింపు కాలపరిమితిని మొత్తం 36 నెలల వరకు పొడిగించే వెసులుబాటు కల్పించినట్లు వివరించారు. ఈ మార్గదర్శకాలను బ్యాంకర్లు సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన రైతులకు ప్రయోజనం చేకూర్చాలన్నారు.కరువు పరిస్థితుల కారణంగా రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమయంలో రుణాల చెల్లింపుల కోసం వారిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావద్దని కలెక్టర్ బ్యాంకు అధికారులకు స్పష్టం చేశారు. రైతుల పట్ల మానవతా దృక్పథంతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బ్యాంకులను ఆశ్రయించే రైతుల దరఖాస్తులను సానుకూలంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి రైతుకు రుణ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

వరి సాగు విస్తీర్ణం 38 వేల ఎకరాలకే పరిమితం

జిల్లాలో గత సీజన్‌లో లక్ష 5 వేల ఎకరాలకు పైగా వరి సాగు చేయగా, ప్రస్తుత కరువు పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణాన్ని సుమారు 38 వేల ఎకరాలకే పరిమితం చేసేలా వ్యవసాయ శాఖ ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు నీటి లభ్యతను బట్టి పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని, వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని పేర్కొన్నారు.కరువు ప్రభావిత రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని, రైతులకు ఆర్థిక ఇబ్బందులు తగ్గించేలా సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.ఈ సమావేశంలో ఎల్డీఎం బి. నాగరాజు, ఆర్బీఐ ఏజీఎం యశ్వంత్ సాయి, ఏజీఎం, నాబార్డ్ చైతన్య, ఏజీఎం చంద్రశేఖర్, ఎస్బీఐ ఆర్ఎం ఆర్బీఓ వరంగల్ రూరల్ ఏవీఎన్ సుబ్బారావు, యూబీఐ ఏజీఎం తేజవత్ సర్వేశ్, ఏజీఎం డీసీసీబీ కృష్ణ మోహన్, ఏజీఎం కేడీసీసీ ఎల్. రాజశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు, జిల్లాలోని అన్ని బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ పై ఆందోళనలు అవసరం లేదు.



ప్రజ్ఞా భారతి సదస్సులో ప్రముఖ పాత్రికేయులు సురేష్ కొచ్చెట్టిల్.

హనుమకొండ, నవంబర్ 04 దేశవ్యాప్తంగా నిర్వహించే ఎస్ఐఆర్ ప్రక్రియ, దాని వెనుక ఉన్న రాజ్యాంగబద్ధమైన అవసరాలు, మరియు ఓటర్ల జాబితా ఆధారిత తొలగింపులపై సాగుతున్న ప్రచారాలపై ప్రజలలో ఆందోళన అవసరం లేదని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, సీనియర్ పాత్రికేయులు సురేష్ కొచ్చట్టిల్ అన్నారు.ప్రజ్ఞ భారతి వరంగల్ శాఖ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ పై హనుమకొండలోని అంబేద్కర్ భవన్లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. ప్రజ్ఞా భారతి వరంగల్ శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ రామ్ గోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు చట్టబద్ధంగా తీసుకునే ప్రమాణ స్వీకారానికి మరియు ఎస్ఐఆర్ ప్రక్రియ అమలుకు ఉన్న సంబంధాన్ని వివరిస్తూ, ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి నిబంధనల ప్రకారం ఇది తప్పనిసరి అని స్పష్టం చేశారు.

ప్రజాప్రతినిధులు (ఎంపీ, ఎమ్మెల్యే లేదా మంత్రులు) పదవీ బాధ్యతలు చేపట్టే ముందు "చట్టం ద్వారా ఏర్పాటు చేయబడిన రాజ్యాంగాన్ని రక్షించి, కాపాడతాను" అని ప్రమాణ స్వీకారం చేస్తారని గుర్తుచేశారు. అందువల్ల రాజ్యాంగబద్ధమైన ఎస్ఐఆర్ ప్రక్రియను కాపాడవలసిన బాధ్యత ప్రజాప్రతినిధులందరిపై ఉందని తెలిపారు.

ఎస్ఐఆర్ చరిత్ర మరియు గత అనుభవాలుఈ ఎస్ఐఆర్ ప్రక్రియ కొత్తదేమీ కాదని, గతంలో 8 సార్లు నిర్వహించబడిందని వివరించారు.

ఇందులో 6 సార్లు కాంగ్రెస్ పార్టీ హయాంలోనే (జవహర్‌లాల్ నెహ్రూ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ కాలంలో) జరిగాయని తెలిపారు. వాజ్‌పేయి హయాంలో కూడా ఒకసారి ఈ ప్రక్రియ పూర్తయ్యిందని చెప్పారు. 2001-2002 నాటి ఎస్ఐఆర్ తర్వాత దాదాపు 24 సంవత్సరాలుగా పూర్తిస్థాయి సవరణ జరగలేదని ప్రస్తావించారు.ఎస్ఐఆర్ సమగ్ర పరిశీలన సమయంలో జాబితా నుండి పేర్లను తొలగించడానికి ప్రధానంగా 4 కారణాలు ఉంటాయని స్పష్టం చేశారు. దానిలో మొదటిది బిఎల్ఓలు (బూత్ లెవల్ అధికారులు) ఇళ్లకు వెళ్లినప్పుడు ఓటర్లు అందుబాటులో లేకపోవడం. రెండవది మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం. మూడవది ఉపాధి లేదా ఇతర కారణాల వల్ల వేరే నగరాలకు/రాష్ట్రాలకు శాశ్వతంగా వలస వెళ్లిపోవడం. నాలుగవది ఒకే వ్యక్తి పేరు సాంకేతిక లోపాలు లేదా చిరునామా మార్పుల వల్ల రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల నమోదై ఉండటం. హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి వంటి అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గంలో దాదాపు 38 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, పెబల్ సిటీ వంటి పెద్ద అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లలో బిఎల్ఓలు స్వయంగా ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించడం లాజిస్టికల్‌గా ఎంతో కష్టతరమైన పనని వివరించారు బీహార్‌లో తొలిదశ ఎస్ఐఆర్ సందర్భంగా 67 లక్షల ఓటర్ల పేర్లను తొలగించినప్పుడు ప్రతిపక్షాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయని, అయితే క్షేత్రస్థాయిలో రీ-అప్లై లేదా డిలీషన్ సవరణలకు అవకాశం ఇచ్చినా నమోదులు అత్యల్పంగానే నమోదయ్యాయని ప్రస్తావించారు. పశ్చిమ బెంగాల్‌లో 1971 బంగ్లాదేశ్ యుద్ధం నాటి నుండి భారీగా చొరబాట్లు జరగడం, నకిలీ పదవ తరగతి సర్టిఫికేట్లు/రేషన్ కార్డులతో ఓటరు గుర్తింపు సాధించడం వంటి అంశాలు ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో స్పష్టంగా బయటపడ్డాయని విశ్లేషించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఓటు హక్కును కాలరాయడానికి కాదని, ఓటర్ల జాబితాలో ఉండే అక్రమాలను, బోగస్ ఓట్లను ఏరివేసి ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన చట్టబద్ధమైన ప్రక్రియ మాత్రమేనని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞాభారతి రాష్ట్ర సహాయ కార్యదర్శి, ప్రముఖ అడ్వకేట్ చామర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రికార్డులు, వ్యక్తిగత వివరాలు,పై అవగాహన, శిక్షణ కార్యక్రమం



భూపాలపల్లి నవంబర్ 04 ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రికార్డులు, వ్యక్తిగత వివరాలు, సేవా సంబంధిత కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఈ-హెచ్ఆర్ఎంఎస్ (వ-ఎ=మీ) విధానంపై బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ సంచాలకులు శ్రీమతి కె. పార్వతీ దేవి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగింది.ప్రస్తుతం అమలులో ఉన్న హెచ్ఆర్ఎంఎస్ (ఎ=మీ) విధానం స్థానంలో ప్రవేశపెడుతున్న నూతన ఈ-హెచ్ఆర్ఎంఎస్ విధానానికి మారు, సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగుల వ్యక్తిగత, సర్వీసు వివరాల నమోదు, వివిధ పరిపాలనా ప్రక్రియలు, సాఫ్ట్‌వేర్ వినియోగ విధానం, అందుబాటులో ఉండే సదుపాయాలపై అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఉప కోశాధికారులు అజహర్ షరీఫ్, కె. జీవన్ రెడ్డి, సతీష్, సహాయ పే అండ్ అకౌంట్స్ అధికారి శ్రీనివాసరావు నాయకత్వం వహించి, నూతన విధానం అమలుకు సంబంధించిన అంశాలను వివరించారు.శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు), వారి కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఈ-హెచ్ఆర్ఎంఎస్ విధానాన్ని అన్ని శాఖల్లో సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. నూతన విధానం ద్వారా ఉద్యోగుల సర్వీసు సంబంధిత కార్యకలాపాలను వేగవంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలవుతుందని అధికారులు పేర్కొన్నారు.

ఏపీలో మేయర్, ఛైర్‌పర్సన్‌ల ప్రమాణ స్వీకారం ఎప్పుడంటే..!



ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ముగిసిన పురపాలక ఎన్నికల ప్రక్రియలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలోని నూతనంగా ఎన్నికైన మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌ల ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 23న వారు తమ బాధ్యతలను అధికారికంగా స్వీకరించనున్నారని ఎస్ఈసీ స్పష్టం చేసింది.రాష్ట్రవ్యాప్తంగా 13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీల్లో ఎన్నికల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. ప్రజలు నేరుగా తమ నగర పాలకులను ఎన్నుకోవడంతో, గెలుపొందిన అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేసేందుకు ఎస్ఈసీ తేదీని ఖరారు చేస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. దీనితో కొత్త పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం కానుంది.అయితే, డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్‌ల ఎన్నికపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ పదవుల ఎన్నికకు సంబంధించిన తేదీలు, విధివిధానాలపై ఎస్ఈసీ నుంచి ప్రత్యేకంగా ప్రకటన వెలువడాల్సి ఉంది. గతంలో ఈ పదవులను పరోక్ష పద్ధతిలో కౌన్సిలర్లు ఎన్నుకునేవారు. అయితే, ఇప్పుడు మేయర్లు, ఛైర్‌పర్సన్ల ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరిగినందున, డిప్యూటీ పదవుల ఎన్నిక ప్రక్రియకు సంబంధించి ఎస్ఈసీ కొత్త మార్గదర్శకాలను జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. నవంబరు 23న మేయర్లు, ఛైర్‌పర్సన్‌లు బాధ్యతలు చేపట్టినప్పటికీ, పూర్తిస్థాయి పాలకవర్గాల ఏర్పాటుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఎస్ఈసీ నుంచి తదుపరి ఆదేశాలు వెలువడిన తర్వాతే డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్‌ల ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కానుంది.

గెజిట్ దిశగా రామచంద్రపురం భూములు..

- అభ్యంతరాల స్వీకరణ పూర్తి!

- 10,600 ఎకరాలు.. 5,500 మంది రైతులు,

- 60 రోజుల గడువు ముగియడంతో తదుపరి ప్రక్రియకు అధికారుల సన్నద్ధం,

- గెజిట్ నోటిఫికేషన్ అనంతరం పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ,

- మల్లంపల్లి ఆంధ్రప్రభ

రామచంద్రపురం భూముల వ్యవహారంలో కీలక ఘట్టం పూర్తయింది. ఏళ్లుగా భూముల హక్కులు, రికార్డులకు సంబంధించి కొనసాగుతున్న ప్రక్రియలో మరో ముందడుగు పడింది.

మల్లంపల్లి నవంబర్ 04 మల్లంపల్లి మండలంలోని రామచంద్రపురం గ్రామ శివారులో ఉన్న భూములకు సంబంధించి అధికారులు చేపట్టిన అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియకు తెరపడింది. భూములపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు విధించిన 60 రోజుల గడువు నవంబర్ 4తో ముగిసింది. ఈ భూముల పరిధి సుమారు 10,600 ఎకరాలు కాగా, దాదాపు 5,500 మంది రైతులకు సంబంధించిన వ్యవహారం కావడంతో ఈ ప్రక్రియకు ప్రాధాన్యత సంతరించుకుంది.

అభ్యంతరాల స్వీకరణ పూర్తి

రామచంద్రపురం గ్రామ శివారులోని భూములకు సంబంధించి అధికారులు సెప్టెంబర్ 5న నోటీసులు జారీ చేశారు. భూముల వివరాలు, రికార్డులకు సంబంధించి ఎవరికైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. ఈ మేరకు 60 రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరించారు. రైతులు, భూముల హక్కుదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు పరిశీలించారు. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి భూముల వివరాలను పరిశీలించినట్లు అధికారులు వెల్లడించారు. అందిన అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కరించాల్సిన సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ నవంబర్ 4తో ముగియడంతో తదుపరి కార్యాచరణకు అధికారులు సిద్ధమవుతున్నారు.గెజిట్ కోసం ఎదురుచూపులు

అభ్యంతరాల స్వీకరణ, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తికావడంతో ఇప్పుడు రైతుల దృష్టి గెజిట్ నోటిఫికేషన్‌పై పడింది. సీసీఎల్ఏ నుంచి వారం రోజుల్లోగా గెజిట్ నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. గెజిట్ ప్రచురితమైన అనంతరం దానిని గ్రామ పంచాయతీ కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రదర్శించనున్నారు. తద్వారా భూములకు సంబంధించిన వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచనున్నారు. గెజిట్ ప్రక్రియలో నిర్దేశించిన తదుపరి అభ్యంతరాల పరిశీలన పూర్తయి, తుది గెజిట్ విడుదలైన అనంతరం పట్టాల పంపిణీకి మార్గం సుగమం కానుంది.పాస్‌పుస్తకాల పంపిణీకి సన్నాహాలు

గెజిట్ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సుమారు 10,600 ఎకరాలకు సంబంధించి 5,500 మంది రైతులకు ఈ ప్రక్రియ ప్రయోజనం చేకూరనుంది. భూముల వివరాలపై స్పష్టత రావడంతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకాలు చేతికి అందితే తమ భూముల హక్కులకు సంబంధించి ఇబ్బందులు తొలగుతాయని రైతులు ఆశిస్తున్నారు. ఈ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి అర్హులైన రైతులకు పాస్‌పుస్తకాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సర్వే శాఖ ఏడీ కిషన్ ప్రసాద్, తహసీల్దార్ విజయభాస్కర్, ఇన్‌చార్జి డీఐఓఎస్ గుణవంతరావు తెలిపారు.



చైనాలో 'టెంపరరీ పిల్లలు'.. ఏమిటీ ట్రెండ్?



చైనాలో ఓ కొత్త, వింతైన పరిశ్రమ వేగంగా విస్తరిస్తోంది. ఒంటరిగా జీవిస్తున్న వృద్ధులకు తోడుగా ఉంటూ, వారి పనుల్లో సాయపడేందుకు యువతీయువకులను కిరాయికి నియమించుకునే 'తాత్కాలిక సంతానం' (టెంపరరీ చిల్డ్రన్) వ్యాపారం ఊపందుకుంది. ఈ 'సహచర ఆర్థిక వ్యవస్థ' (కంపానియన్‌షిప్ ఎకానమీ) విలువ ఇప్పటికే 7.4 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 61,000 కోట్లకు పైగా) చేరిందంటే దీనికి పెరుగుతున్న ఆదరణను అర్థం చేసుకోవచ్చు.

ఏం చేస్తారంటే? ఈ 'తాత్కాలిక పిల్లలు' బంధువులు కారు. వీరు డబ్బు తీసుకుని వృద్ధులకు సేవలు అందిస్తారు. రోజూ రెండు పూటలా భోజనం తీసుకురావడం, ఆసుపత్రికి తోడుగా వెళ్లి కావాల్సిన పత్రాలు సిద్ధం చేయడం, మందులు తీసుకురావడం వంటివి వీరి బాధ్యతలు. అంతేకాకుండా, ఇంట్లో చిన్న చిన్న పనులు చక్కబెట్టడం, ఒంటరితనాన్ని దూరం చేయడానికి వారితో మాట్లాడటం వంటి భావోద్వేగపరమైన మద్దతును కూడా అందిస్తారు. భర్త చనిపోయి, కంటిచూపు మందగించడంతో బీజింగ్‌కు చెందిన 91 ఏళ్ల వృద్ధురాలు టీవీతోనే మాట్లాడుకునేది. ఇప్పుడు 'తాత్కాలిక పిల్లలు' ఆమెకు భోజనం అందిస్తూ, ఇంట్లో సాయం చేస్తూ తోడుగా ఉంటున్నారు.

ఎందుకీ పరిస్థితి? చైనాలో ఈ వినూత్న పరిశ్రమ అభివృద్ధి చెందడానికి ప్రధానంగా మూడు కారణాలున్నాయి. 1. ఒకే బిడ్డ విధానం: దశాబ్దాల పాటు అమలైన 'ఒకే బిడ్డ' విధానం వల్ల చాలా కుటుంబాల్లో తల్లిదండ్రులిద్దరినీ చూసుకోవాల్సిన బాధ్యత ఒక్కరిపైనే పడింది. వారు తమ ఉద్యోగాలు, పిల్లల పెంపకంతో సతమతమవుతూ తల్లిదండ్రులకు సమయం కేటాయించలేకపోతున్నారు.2. వలసలు: ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువతరం నగరాలకు వలస వెళ్లడంతో, గ్రామాల్లో వృద్ధ తల్లిదండ్రులు ఒంటరవుతున్నారు. వీడియో కాల్స్‌లో మాట్లాడినా, ప్రత్యక్షంగా తోడుగా ఉండటానికి అవి ప్రత్యామ్నాయం కాలేకపోతున్నాయి.3. జనాభా: చైనాలో వృద్ధుల జనాభా శరవేగంగా పెరుగుతోంది. 2025 చివరి నాటికి 60 ఏళ్లు పైబడిన వారి సంఖ్య 32 కోట్లకు, 2035 నాటికి 40 కోట్లకు చేరుతుందని అంచనా. ఈ డిమాండ్‌కు తగినట్లు నిపుణులైన కేర్ వర్కర్లు అందుబాటులో లేరు.ఈ పరిణామం కొన్ని కీలకమైన ప్రశ్నలను కూడా లేవనెత్తుతోంది. కుటుంబ సభ్యుల నుంచి రావాల్సిన ప్రేమ, ఆప్యాయతలను ఇలా డబ్బుతో కొనుక్కోవడం సరైనదేనా అనే చర్చ మొదలైంది. ఏదేమైనా, చైనాలో మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులకు ఈ 'తాత్కాలిక సంతానం' పరిశ్రమ అద్దం పడుతోంది.

ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డికి ఈడీ కస్టడీ



ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో దర్యాప్తు ముమ్మరమైంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డిని రెండు రోజుల పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి అనుమతిస్తూ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు అతడిని కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు.ప్రస్తుతం విజయవాడ జైలులో ఉన్న ఈశ్వర్ రెడ్డిని ఈడీ అధికారులు పీటీ వారెంట్‌పై నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. అతడిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరగా, న్యాయస్థానం రెండు రోజులకు అనుమతించింది. అంతకుముందు ఈశ్వర్‌కు ఈ నెల 16వ తేదీ వరకు కోర్టు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ఏపీ లిక్కర్ స్కామ్‌లో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కెసిరెడ్డికి ఈశ్వర్ అత్యంత సన్నిహితుడని ఈడీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ కుంభకోణంలో ఈశ్వర్ పాత్ర, జరిగిన ఆర్థిక లావాదేవీలు, తెరవెనుక ఉన్న ఇతర కీలక వ్యక్తుల ప్రమేయంపై ఈడీ అధికారులు లోతుగా ఆరా తీయనున్నారు. ఈ రెండు రోజుల విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

పీడిత ప్రజల గొంతుక దాశరథి కృష్ణమాచార్య

వరంగల్ నవంబర్ 04 తెలంగాణ ప్రజల కన్నీళ్లని అగ్ని ధారగా మలచి నిజాం పాలన మీదికి ఎక్కు పెట్టిన మహా కవి దాశరథి పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకుని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి కృష్ణమాచార్య చిరస్మరణీయుడు.నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గర్వంగా ప్రకటించిన ఉద్యమ సేనాని.

ఓ నిజాం పిశాచమా కానరాడు
నిన్ను బోలిన రాజు మాకెన్నడేనని
తీగలను తెంపి అగ్నిలో దింపినావు.

నిజాం రాజు తరతరాల బూజు అని గొంతెత్తిన కవిదాశరథి గా పేరు గాంచిన దాశరథి కృష్ణమాచార్యులు జూలై 22, 1925 న మహబూబాద్ జిల్లా చిన్న గూడూర్ లో జన్మించారు. నిజాం ప్రభువును ఎదిరిస్తూ రచనలు చేశాడు. తెలంగాణ విముక్తి కోసం కృషి చేశాడు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికి ప్రేరణనందించిన కవి దాశరథి. పలు సినిమాలకు గేయరచయితగా పనిచేశాడు. ప్రతి సంవత్సరం దాశరథి జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో సాహిత్యరంగంలో కృషిచేసినవారికి తెలంగాణ ప్రభుత్వం దాశరథి సాహితీ పురస్కారం అందజేస్తోంది వీరి తల్లిదండ్రులు

దాశరథి వెంకటాచార్య వెంకటమ్మ బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యులేషను, భోపాల్ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్మీడియెట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు సాహిత్యంలో బి.ఎ చదివాడు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనంలోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించాడు. ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండి రెండో ప్రపంచయుద్ధం సమయంలో ఆ పార్టీ వైఖరి నచ్చక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చిహైదరాబాదు సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా



జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకున్నాడుఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్‌స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసాడు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసాడు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసాడు.నిజాం పాలనలో రకరకాల హింసలనుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయాడు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించాడు.

" రైతుదే తెలంగాణము రైతుదే. ముసలి నక్కకు రాచరికంబు దక్కునే అని గర్జించాడు.

దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్

"అని నిజాముని సూటిగా గద్దిస్తూ రచనలు చేసాడు.

ఆంధ్రమహాసభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవించాడు. నిజామాబాదు లోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది, నిజాము ప్రభుత్వం. ఆయనతోపాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. పళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిన్నాడు. మంచి ఉపన్యాసకుడు. భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకడు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నిర్మించాడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా 1977 ఆగస్టు 15 నుండి 1983 వరకు పనిచేశాడు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకున్నాడు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నాడు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించాడు. తల్లి మీద, తల్లి తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు ఇప్పటికీ ఎందరికో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి.

1987 నవంబరు 5వ తేదీన కన్నుమూశాడు దాశరథి.వీరు ఎన్నో

రచనలు, చేసి పలు అవార్డులు, బిరుదులు అందుకున్నారు వీరు జన్మించిన మహబూబాద్ జిల్లాకు దాశరది జిల్లా గా పేరు పెట్టాలి వీరిని ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి వారి రచనలు అధ్యయనం చేయాలి

కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా
నవంబర్ 5 న ప్రసిద్ధ కవి దాశరథి కృష్ణమాచార్య వర్ధంతి సందర్భంగా9848445134 తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్య క్షులు

టైగర్ నల్లా నరసింహులు స్ఫూర్తితో బి.సి వాటా సాధిద్దాం

వరంగల్ నవంబర్ 04 పోరాటమే జీవితంగా సాగిన ప్రజా యోధుడు అణచివేతపై తిరుగుబాటు చేసిన తెలంగాణ విప్లవ సింహం నల్లా నర్సింహులు నేటి బి.సి ఉద్యమాలకు స్ఫూర్తిగా మారాల్సిన అవసరముంది. చరిత్ర అనేది కేవలం రాజులు, రాజ్యాలు, అధికార పీఠాల కథ కాదు. అన్యాయాన్ని ఎదిరించి, అణగారిన ప్రజల ఆత్మగౌరవం కోసం తమ జీవితాలనే పోరాట బాటలో అంకితం చేసిన సామాన్యుల అసామాన్య చరిత్ర కూడా ఉంది. అలాంటి పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన పేరు నల్లా నరసింహులు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో ఆయన ఒక ధైర్యానికి ప్రతీక. నిరంకుశత్వానికి ఎదురొడ్డి నిలిచిన తెగువకు నిదర్శనం. పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత పోరాట యోధుడు.

పేదరికం నుంచి పోరాట పంథా వరకు 1926 అక్టోబర్ 2న అప్పటి జనగామ తాలూకాలోని కడవెండి గ్రామంలో నల్లా లచ్చయ్య, లచ్చమ్మ దంపతులకు జన్మించిన నల్లా నరసింహులు నిరుపేద పద్మశాలి చేనేత కుటుంబం ఆయనది. ఏడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్నప్పటికీ, జీవిత పాఠాలు ఆయనకు సమాజాన్ని చదివే విజ్ఞానాన్ని అందించాయి.ఆ రోజుల్లో తెలంగాణ ప్రాంతం నిజాం నిరంకుశ పాలనలో మగ్గుతోంది. దేశ్‌ముఖ్‌లు, జమీందార్లు, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీ, రజాకార్ల దౌర్జన్యాలు పేద ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. కడవెండి గ్రామం కూడా విసునూరు దేశ్‌ముఖ్ ఆధిపత్యంలో అణచివేతకు గురవుతోంది. తన కళ్లముందు పేదలపై జరుగుతున్న అన్యాయాలు, తన కుటుంబం ఎదుర్కొన్న కష్టాలు, ముఖ్యంగా తండ్రి భూస్వామ్య దౌర్జన్యాలకు బలికావడం ఆయనలో తిరుగుబాటు స్ఫూర్తిని రగిలించాయి. అప్పటివరకు సామాన్య చేనేత కార్మికుడిగా ఉన్న నరసింహులు, అన్యాయాన్ని ప్రశ్నించే ప్రజా ఉద్యమకారుడిగా మారారు.

ఆంధ్ర మహాసభతో నల్లా నరసింహులు ఉద్యమ ప్రస్థానం

తెలంగాణ ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యం పెంపొందించడంలో ఆంధ్ర మహాసభ కీలక పాత్ర పోషించింది. భువనగిరిలో జరిగిన పదకొండవ ఆంధ్ర మహాసభ ప్రభావంతో నరసింహులు ప్రజా ఉద్యమంలో మరింత చురుకుగా పాల్గొన్నారు. గ్రామగ్రామాన ప్రజలను సంఘటితం చేయడం, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా చైతన్యం కల్పించడం, భూస్వాముల దౌర్జన్యాలను ప్రశ్నించడం ఆయన ఉద్యమ జీవితంలో ప్రధాన భాగాలయ్యాయి. తన జీవిత సహచరి వజ్రమ్మను కూడా ఉద్యమంలో భాగస్వామిని చేశారు. కుటుంబ బంధాలకంటే ప్రజా విముక్తి లక్ష్యమే గొప్పదని భావించి, ఇద్దరూ అజ్ఞాత జీవితాన్ని ఎంచుకున్నారు. గ్రామ దళాల నిర్మాణం, ప్రజలకు శిక్షణ, మహిళల్లో పోరాట చైతన్యం పెంపొందించడం వంటి కార్యక్రమాల్లో నరసింహులు కీలక పాత్ర పోషించారు.

నల్లా నర్సింహులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అలుపెరుగని వీరోచిత పాత్ర పోషించారు 1946 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భారతదేశ చరిత్రలో ఒక విశిష్ట అధ్యాయం. దొడ్డి కొమురయ్య అమరత్వంతో మరింత ఉధృతమైన ఈ పోరాటంలో నల్లా నరసింహులు జనగామ ప్రాంత దళ నాయకుడిగా ఎదిగారు. దున్నేవాడికే భూమి కావాలని వెట్టిచాకిరీ అంతం కావాలనిదోపిడీ, దౌర్జన్యాలకు స్వస్తి పలకాలననే ఆశయాలు ఆయన పోరాటానికి ప్రధానంగా ప్రేరణనిచ్చినవి. గ్రామీణ పేదలను సంఘటితం చేస్తూ, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాన్ని విస్తరించారు. ప్రజల ఆత్మగౌరవం, భూమి హక్కులు, సామాజిక సమానత్వం కోసం తన సహచరులతో కలిసి పోరాటాన్ని కొనసాగించారు.

ఆయన నాయకత్వంలో దళాల నిర్మాణం, గెరిల్లా పోరాట వ్యూహాలు, ప్రజా రక్షణ కార్యక్రమాలు విస్తరించాయి.

నరసింహులు పేరు వినగానే నిరంకుశ పాలకులకు, వారి అనుచరులకు వణుకు పుట్టేది. ఆయన ధైర్యసాహసాలు, పోరాట పటిమకు గుర్తింపుగా 'తెలంగాణ టైగర్' అనే బిరుదు స్థిరపడింది. నల్లా నర్సింహులుది ఉరికంబం ఎదురైనా వెనుకడుగు వేయని ధైర్యం. ఒక వ్యక్తి తన ప్రాణాలను కాపాడుకోవడం కోసం పోరాటాన్ని వదిలిపెట్టవచ్చు. కానీ నరసింహులు తన ప్రాణాలకంటే ప్రజల హక్కులకే ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన జీవితంలో అరెస్టులు, చిత్రహింసలు, జైలు జీవితం, న్యాయస్థానాల్లో కేసులు నిత్యకృత్యాలయ్యాయి. అనేక కేసులను ఎదుర్కొన్నారు. ఏకంగా మూడుసార్లు మరణశిక్షను ఎదుర్కొన్నారు. అయినా ఆయన ధైర్యం సడలలేదు. న్యాయస్థానాల్లోనూ తన రాజకీయ, సామాజిక భావజాలాన్ని ధైర్యంగా వినిపించారు. ఒక సామాన్య చేనేత కుటుంబంలో పుట్టిన వ్యక్తి, నిరంకుశ పాలనను ఎదిరించి, ఉరికంబాన్ని సైతం లెక్కచేయని పోరాట యోధుడిగా ఎదగడం అసాధారణమైన విషయం. 1951లో సాయుధ పోరాట విరమణ ప్రకటన వెలువడినప్పటికీ, నరసింహులు ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలు వెంటనే ముగియలేదు. చివరకు 1959 జనవరి 26న సుదీర్ఘ జైలు జీవితం నుంచి విడుదలయ్యారు.ఆయన జైలు జీవితం కేవలం వ్యక్తిగత కష్టాల చరిత్ర కాదు. ఒక సామాజిక వ్యవస్థ మార్పు కోసం పోరాడిన వ్యక్తి ఎదుర్కొన్న త్యాగాల చరిత్ర.


నరసింహులు పోరాట జీవితాన్ని ప్రస్తావించేటప్పుడు ఆయన భార్య వజ్రమ్మ త్యాగాన్ని విస్మరించలేం. భర్తతో పాటు అజ్ఞాత జీవితం గడిపారు. ఉద్యమంలో భాగస్వామిగా నిలిచారు. జైలు జీవితాన్ని అనుభవించారు. ఆమె జైలులో ఉన్న సమయంలోనే ఒక ఆడ శిశువుకు జన్మనివ్వడం ఆ కుటుంబం ఎదుర్కొన్న విషాద పరిస్థితులకు నిదర్శనం. ఒకవైపు భర్త ప్రజా పోరాటం, మరోవైపు కుటుంబ బాధ్యతలు, ఇంకోవైపు నిర్బంధ జీవితం. ఇన్ని కష్టాల మధ్య కూడా వజ్రమ్మ తన సహచరి ఆశయాలకు అండగా నిలిచారు. వారి జీవితాలు వ్యక్తిగత సుఖసంతోషాల కంటే ప్రజా ప్రయోజనాలకే అంకితమైన అరుదైన దాంపత్యానికి ప్రతీకలు.ఆ దంపతులకు ముగ్గురు అడ బిడ్డలు అందులో ఒకరు మరణించారు. తండ్రి అశయాలను అతని బిడ్డ అరుణమ్మ కొనసాగిస్తున్నది. నల్లా నర్సింహులు పోరాట చరిత్రను భావితరాలకు అందించిన రచయిత కూడా. తను కేవలం పోరాట యోధుడే కాదు తాను జీవించిన కాలాన్ని, అనుభవించిన సంఘటనలను భావితరాలకు అందించాలనే తపన కలిగిన చరిత్రకారుడు కూడా. 1987లో తెలంగాణ సాయుధ పోరాటం నలభైవ వార్షికోత్సవం సందర్భంగా తన అనుభవాలను విస్తృతంగా నమోదు చేశారు. ఆ రచన 1989లో 'తెలంగాణ సాయుధ పోరాటం – నా అనుభవాలు' అనే పుస్తకంగా వెలువడింది. ఆ పుస్తకం ద్వారా తెలంగాణ రైతాంగ పోరాటంలోని అనేక చారిత్రక సంఘటనలు, అమరుల త్యాగాలు, ప్రజల పోరాట పటిమ భావితరాలకు పరిచయమయ్యాయి.

ఇది ఆయన జీవితంలో మరో గొప్ప విజయంగా చెప్పుకోవచ్చు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వేలాది మంది ప్రాణత్యాగాలకు సాక్ష్యంగా నిలిచింది. ఆ పోరాట ఫలితంగా భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం పెరిగింది. లక్షలాది ఎకరాల భూమి పేద రైతుల చేతుల్లోకి వెళ్లడానికి ఉద్యమం దోహదపడింది. నరసింహులు జీవితమంతా ఈ పోరాట స్ఫూర్తిని తనలో నిలుపుకున్నారు. చివరి శ్వాస వరకు ఉజ్వలమైన తన ఆశయాలను, సహచరుల త్యాగాలను స్మరించుకుంటూ జీవించారు. 1993 నవంబర్ 5న ఆయన భౌతికంగా మనకు దూరమైనప్పటికీ, ఆయన పోరాట స్ఫూర్తి మాత్రం చరిత్రలో సజీవంగా నిలిచిపోయింది.

నల్లా నరసింహులు జీవితం మనకు ఎన్నో పాఠాలు నేర్పుతుంది.

పేదరికం ప్రతిభకు అడ్డంకి కాదని, చదువుకున్న తరగతులకే చరిత్రను సృష్టించే అవకాశం పరిమితం కాదని, సామాజిక చైతన్యం, ధైర్యం, నిబద్ధత ఉంటే ఒక సామాన్యుడు కూడా అసామాన్య చరిత్రను నిర్మించగలడని ఆయన జీవితం నిరూపించింది. అధికారం ముందు తలవంచని ఆత్మగౌరవం, అన్యాయం ముందు మౌనం వహించని పోరాట పటిమ, వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యతనిచ్చే త్యాగనిరతి ఆయన వ్యక్తిత్వంలో కనిపించే విశిష్ట లక్షణాలు.అవే అతన్ని చిరస్మరణీయునిగా చేసినవి. నేటి తరానికి ఆయన జీవితం ఒక చారిత్రక పాఠం. సమాజంలోని అసమానతలను ప్రశ్నించే చైతన్యానికి ఒక స్ఫూర్తి. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేసే ఒక సందేశం. ఆయన జీవితం ఒక పోరాటం. ఆయన ప్రయాణం ఒక చరిత్ర. ఆయన త్యాగం ఒక స్ఫూర్తి. ఆయన ఆశయం భావితరాలకు ఒక మార్గదర్శకం. నల్లా నరసింహులు వంటి మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయడం, వారి పోరాట వారసత్వాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత.



నల్లా నర్సింహులు భౌతికంగా దూరమైనా భావజాలంలో చిరంజీవి. ప్రజా పోరాట చరిత్రలో అజరామరుడు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలోనల్లా నరసింహులు తెలంగాణ టైగర్ గా ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోయాడు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, స్వాతంత్రం లేక నిత్య నిర్బంధంలో పోరాటం చేసి ప్రజలకు ఎన్నో హక్కులను సాధించిన నల్ల నర్సింహులు స్ఫూర్తితో నేటి ప్రజాస్వామ్య దేశంలో బి.సి ల వాటా సాధించడానికి ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరముంది.

(నవంబర్ 5న నల్ల నర్సింహులు 33వ వర్ధంతి)
సుధీర్ వలుసన్యాయవాది, వరంగల్ 9908763710

నకిలీ కరెన్సీ ముద్రణ ముఠా గుట్టురట్టు

– నలుగురు నిందితుల అరెస్ట్, రూ. 6.78 కోట్ల విలువైన నకిలీ కరెన్సీ స్వాధీనం.

సాంకేతిక ఆధారాలు మరియు నిర్దిష్ట సమాచారంతో, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం జోన్‌కు చెందిన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, ఎస్ఓటి షాద్‌నగర్ బృందంతో కలిసి నకిలీ కరెన్సీ నోట్ల తయారీలో పాల్గొన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న (ఏ1) మడుపోజు కర్ణాకర్, (ఏ2) చిన్నోల్ల మాణిక్య రెడ్డి, (ఏ3) చెరుకుపల్లి రత్నాకర్ రెడ్డి, (ఏ4) కరణం అజయ్ కుమార్‌లను 01.11.2026న రాత్రి 10:15 గంటలకు వాహన తనిఖీల సమయంలో అరెస్ట్ చేశారు. అబ్దుల్లా పూర్‌మెట్, రంగారెడ్డి జిల్లా, జాతీయ రహదారి -65పై రామోజీ ఫిల్మ్ సిటీ ప్రధాన ద్వారం ఎదురుగా బాలాజీ ధాబా సమీపంలో వీరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 7డిక్యూ, 447301, 7డిక్యూ, 447302,7డిక్యూ, 447303, 7డిక్యూ, 447304, 2బిఎల్ 101309, 2BL 101311,2 బిఎల్ 101312,2 బిఎల్ 101313 అనే సీరియల్ నంబర్లతో ఉన్నట్లు పేర్కొన్న రూ. 6,78,00,000 విలువైన నకిలీ కరెన్సీ నోట్లు మరియు ఇతర నేరానికి సంబంధించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

-నేరం చేసే విధానం

సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో నిందితులు నకిలీ కరెన్సీ నోట్లను తయారు చేసి మార్కెట్‌లో చలామణి చేయాలని కుట్ర పన్నినట్లు పోలీసుల సమాచారం. మొదట నిందితులు 1,2,4 నకిలీ నోట్ల తయారీకి ప్రయత్నించి విఫలమయ్యారు. అనంతరం నిందితులు 1,2,4,5,6 నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు, డమ్మీ పిస్టల్ ఉపయోగించి పోలీసులుగా నటిస్తూ కస్టమర్ల నుంచి డబ్బు వసూలు చేయాలని పథకం వేశారు. ఈ విధంగా ఇద్దరు వేర్వేరు వ్యక్తుల నుంచి వరుసగా రూ. 2,00,000 మరియు రూ. 3,00,000 వసూలు చేసి, ఆ మొత్తాలను తమలో పంచుకున్నట్లు ఆరో పణలు ఉన్నాయి. తదుపరి ఏ 1 నుంచి ఏ 4 వరకు కుంట్లూరులో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని, నకిలీ కరెన్సీ తయారీకి అవసరమైన ప్రింటర్లు, స్కానర్, లామినేషన్ యంత్రం మరియు ఇతర పరికరాలను సమకూర్చుకున్నట్లు తెలిపారు. అసలు రూ. 500 నోట్లను స్కాన్ చేయడం, ఫోటోషాప్ సాఫ్ట్‌వేర్‌తో చిత్రాలను సవరించడం, నకిలీ నోట్లను ముద్రించడం వంటి విధానాలను ఏ1 యూట్యూబ్ వీడియోలు మరియు సోషల్ మీడియా కంటెంట్ ద్వారా నేర్చుకున్నట్లు పేర్కొన్నారు. ముద్రించిన నోట్లను కత్తిరించి మార్కెట్‌లో చలామణి చేయాలని వారు ప్రణాళిక వేసినట్లు తెలిపారు. నకిలీ కరెన్సీని చలామణి చేయడానికి చేసిన ప్రయత్నాలు విఫలమైన తర్వాత, ఏ1 మరియు ఏ2 కొత్త పద్ధతిని అనుసరించినట్లు పేర్కొన్నారు. కస్టమర్లకు 1:3 లేదా 1:4 నిష్పత్తిలో నకిలీ కరెన్సీ ఇస్తామని చెప్పి, మొదట అసలు కరెన్సీ చూపించి నమ్మకం కలిగించేవారు. అనంతరం ముఠా సభ్యులు నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు, వాకీటాకీలు, డమ్మీ పిస్టళ్లతో పోలీసులుగా నటిస్తూ, నకిలీ నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాల్లో వచ్చి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరించి, కస్టమర్ల అసలు డబ్బును దోచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

-నమోదైన / ఒప్పుకున్న కేసు

1. క్రైమ్ నం. 860/2026 -- భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 178,179, 180, 181, 318(4), 204, 205, 351(2), 61(2) 3(5), అలాగే ఇండియన్ వైర్‌లెస్ టెలిగ్రాఫీ యాక్ట్ సెక్షన్లు 3 మరియు 6; అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్.

-నిందితుల వివరాలు



1.ఏ1 మడుపోజు కర్ణాకర్, తండ్రి: కృష్ణ, వయస్సు 27 సంవత్సరాలు, కులం: చారి, వృత్తి: వ్యాపారం. చిరునామా: ఇంటి నెంబర్.1-65,ఉప్పరిగూడ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, రంగారెడ్డి జిల్లా. మొబైల్: 9391689579. ఆధార్: 8854 4059 5141.

2.ఏ2 చిన్నోల్ల మాణిక్య రెడ్డి, తండ్రి: చంద్ర రెడ్డి, వయస్సు 52 సంవత్సరాలు, కులం: రెడ్డి, వృత్తి: వ్యాపారం. చిరు నామా: ప్లాట్ నం. 778, వివేకానంద నగర్ కాలనీ, చర్చి సమీపంలో, గేట్ నం. 1,కూకట్‌పల్లి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా. మొబైల్: 8019030611. ఆధార్: 9866 5291 4000.

3.ఏ3 చెరుకుపల్లి రత్నాకర్ రెడ్డి, తల్లి/తండ్రి వివరాల్లో పత్రంలో పేర్కొన్న పేరు: భాగ్యలక్ష్మి, వయస్సు 30 సంవత్సరాలు, కులం: రెడ్డి, వృత్తి: డ్రైవర్. చిరునామా: ఇంటి నెంబర్.1-39, కోసునూరుపల్లి గ్రామం, ధర్మపురి మండలం, జగిత్యాల జిల్లా. మొబైల్: 7013994131.

4. ఏ4 కరణం అజయ్ కుమార్, తండ్రి: మధుసూధన్ రావు, వయస్సు 34 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం. చిరు నామా:
ఇంటి నెంబర్ .4-100-29/డీ, సంతోష్ నగర్, ఏనుగొండ, మహబూబ్‌నగర్ జిల్లా. మొబైల్: 9390148268.

-పరారీలో ఉన్న నిందితులు

5. ఏ 5 జెల్లి వెంకటేష్, తండ్రి: అంజనేయులు, వయస్సు 30 సంవత్సరాలు, కులం: బిసి --ముదిరాజ్, వృత్తి:జెసిబి మెకానిక్. చిరునామా: ప్లాట్ నం. 70, సాయి నగర్ కాలనీ, పెద్ద అంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా. స్వస్థలం: ఇంటి నెంబర్ 1-112, ముచ్చింతల్ గ్రామం, కొకుంట్ల మండలం, మహబూబ్‌నగర్ జిల్లా.

6. ఏ 6 కుంజా బాలరాజు, తండ్రి: బాబు రావు, వయస్సు 46 సంవత్సరాలు, వృత్తి: రియల్ ఎస్టేట్ వ్యాపారం. చిరునామా: పాత మమత మెడికల్ కాలేజీ ఎదురుగా, రోటరీ నగర్, ఖమ్మం జిల్లా. స్వస్థలం: సూరారం గ్రామం, జూలూ రుపాడు మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

7. ఏ7 కాంపసాటి శ్రీనివాస్, తండ్రి: రాములు, వయస్సు 38 సంవత్సరాలు, కులం: యాదవ, వృత్తి: వ్యవసాయం. చిరునామా: ఇంటి నెంబర్ 6/99, సూరారం గ్రామం, జూలూరుపాడు మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. మొబైల్: 8008517817.

- స్వాధీనం చేసుకున్న వస్తువులు

2.పేపర్ కట్టింగ్ మెషిన్ -- 1
3.ఎప్సన్ కలర్ ప్రింటర్ -- 1
4.ఛార్జర్‌తో కూడిన డెల్ ల్యాప్‌టాప్ -- 1
5. శామ్‌సంగ్ లేజర్ ప్రింటర్ -- 1
6. కరెన్సీ లెక్కించే యంత్రం.
7. కరెన్సీ బండ్లింగ్ యంత్రం. -- 1
8.హెచ్పి కలర్ లేజర్ జెట్ ప్రో ప్రింటర్ -- 1
9. హెచ్ పి కలర్ ప్రింటర్ (హెచ్పి స్మార్ట్ ట్యాంక్ 585) -- 1
10.లామినేషన్ యంత్రం బిఎస్ బి గోల్డ్ మోడల్ -- 1
11.ఎప్సన్ బ్లాక్ ఇంక్ బాటిళ్లు -- 23
12.ఎప్సన్ పసుపు ఇంక్ బాటిళ్లు -- 7
13. ఎప్సన్ నీలం ఇంక్ బాటిళ్లు -- 13
14. ఎప్సన్ మజెంటా/పింక్ ఇంక్ బాటిళ్లు -- 8 15. పారదర్శక తెలుపు పేపర్ రోల్ -- 1
16.జెకె ఎక్సెల్ బాండ్ పేపర్ బండిళ్లు-- 12 17.కర్ణాకర్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఉన్న స్టాంపులు -- 2
18.ఆకుపచ్చ రియాక్టివ్ ఫాయిల్ రోల్స్ --319. గాంధీ షాడో స్టాంప్ -- 1
20.టీఎస్09 ఈ ఈ 1535 రిజిస్ట్రేషన్ నంబరు ఉన్న నంబర్ ప్లేట్లు -- 2
21. టీఎస్ 07 జే హెచ్ 1762 రిజిస్ట్రేషన్ నంబరు ఉన్న నంబర్ ప్లేట్లు -- 2
22. ఎం హెచ్ 02 ఈ ఈ 8646 రిజిస్ట్రేషన్ నంబరు ఉన్న నంబర్ ప్లేట్లు -- 2
23. మడతపెట్టే టేబుళ్లు -- 2

-కేసు వివరాలు

01.11.2026న రాత్రి సుమారు 8:00 గంటలకు, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ ఎస్సై మరియు సిబ్బందికి, టీఎస్ 04 ఈవై 7291 నంబరు గల మారుతి డిజైర్ కారులో నలుగురు వ్యక్తులు నకిలీ కరెన్సీ నోట్లను విజయవాడకు తరలిస్తున్నారని, వారు జాతీయ రహ -65పై రామోజీ ఫిల్మ్ సిటీ ఎదురుగా ఉన్న బాలాజీ ధాబా మార్గంలో వెళ్తున్నారని విశ్వసనీయ సమా చారం అందింది. పై అధికారికి సమాచారం ఇచ్చిన అనం తరం ఎస ఇద్దరు మధ్యవర్తులు, క్లూస్ టీమ్ మరియు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసుకుని, రాత్రి 10:15 గంటలకు వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానిత కారును ఆపి తనిఖీ చేయగా, అందులో నలుగురు వ్యక్తులు ఉన్నారు. కారు డిక్కీలో బూడిద రంగు సంచిలో 500 రూపాయల నోట్లుగా అనుమానించిన 16 కట్టలు (1,600 నోట్లు, మొత్తం విలువ రూ. 8 లక్షలు), ఒక డమ్మీ పిస్టల్, రెండు బావోఫెంగ్ వాకీటాకీ సెట్లు, మూడు నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు లభించాయి. రామోజీ ఫిల్మ్ సిటీలోని సెక్యూరిటీ గదిలో మధ్యవర్తుల సమక్షంలో నిర్వహించిన నేరాంగీకార--స్వాధీన ప్రక్రియలో, పై నకిలీ కరెన్సీ కట్టలు, నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు, డమ్మీ పిస్టల్, వాకీటాకీ సెట్లు, నాలుగు మొబైల్ ఫోన్లు మరియు మారుతి డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులు హయత్‌నగర్ మండలం కుంట్లూరులో అద్దె ఇంట్లో నకిలీ కరెన్సీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడైందని పత్రంలో పేర్కొన్నారు. కలర్ ప్రింటర్లు, లేజర్ ప్రింటర్, ఎప్సన్ ప్రింటర్-కమ్-స్కానర్, ల్యాప్‌టాప్, లామినేషన్ యంత్రం, కరెన్సీ కట్టింగ్ యంత్రం, ఏ4 పేపర్ తదితర పరికరాలను ఉపయోగించి నకిలీ రూ. 500 నోట్లను తయారు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అసలు కరెన్సీ నోట్ల చిత్రాలు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ మరియు ముద్రణ పరికరాలను ఉపయోగించి పెద్ద మొత్తంలో నకిలీ నోట్లను తయారు చేసినట్లు, అలాగే నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు, డమ్మీ పిస్టళ్లు, వాకీటాకీలతో పోలీసులుగా నటించి కొనుగో లుదా రులు మరియు ఇతరులను బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నా యి. నిందితులు వెల్లడించిన సమాచారం ఆధారంగా పోలీ సులు కుంట్లూరులోని అద్దె ఇంటిని తనిఖీ చేసి, రూ. 6.7 కోట్ల విలువైనట్లు పేర్కొన్న 134 కట్టల అనుమానిత నకిలీ రూ. 500 నోట్లు, ప్రింటర్లు, ల్యాప్‌టాప్, లామినేషన్ యం త్రం, కట్టింగ్ యంత్రం మరియు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.వాహనం మరియు అద్దె ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపిన మొత్తం అనుమానిత నకిలీ కరెన్సీ విలువ రూ. 6.78 కోట్లు. ఈ తయారీ మరియు చలామణి నెట్‌వర్క్‌లో ఏ1 నుంచి ఏ4 వరకు నిందితుల పాత్రతో పాటు, ఇతర సహచరులను గుర్తించి, మిగిలిన నిందితుల ప్రమేయాన్ని నిర్ధారించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా.తరుణ్ జోషి,ఐపీఎస్; మహేశ్వరం జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.నారాయణ రెడ్డి, ఐపీఎస్; ఇబ్రహీం పట్నం డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కే.పి.వి రాజు; ఎస్ఓటి షాద్‌నగర్ జోన్ ఇన్‌స్పెక్టర్ భూపాల్ శ్రీధర్; అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్ రాజు మరియు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్, ఎస్ఓటి షాద్ నగర్ జోన్ సిబ్బంది పర్యవేక్షణలో ఈ కేసును ఛేదిం చారు. నకిలీ కరెన్సీ ముద్రణ చలామణి ముఠాను విజయ వంతంగా గుర్తించి, ఏ 1 నుంచి ఏ 4 వరకు నిందితులను అదుపులోకి తీసుకుని, నేరానికి ఉపయోగించినట్లు పేర్కొన్న ఇతర వస్తువులతో పాటు రూ.
6.78 కోట్ల విలువైన నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు.
ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్

వరద నీటి పైపులైన్ నిర్మాణం కోసం రూ. 5.95 కోట్ల నిధులు మంజూరు!



సాహెబ్ నగర్, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న వరద ముంపు సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది. ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ ప్రత్యేక చొరవతో బి.ఎన్.రెడ్డి నగర్‌లోని కాప్రాయి చెరువు నుంచి హయత్ నగర్‌లోని కుమ్మరికుంట వరకు వరద నీటి పైపులైన్ నిర్మాణానికి రూ. 5.95 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అంతేకాకుండా టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఇటీవల మధుయాష్కి గౌడ్ కాప్రాయి చెరువును సందర్శించిన సందర్భంగా పరిసర కాలనీల ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు వరద ముంపు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి తమ ఇబ్బందులను వివరించారు. గత ఏడాది వర్షాకాలంలో వరదల సమయంలోనూ ఎదుర్కొన్న ఇబ్బందులను పలుమార్లు కాలనీవాసులు వివరించారు. ప్రజల సమస్యలపై స్పందించిన మధుయాష్కి గౌడ్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడి, వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రణాళికలు రూపొందించి వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి వర్షాకాలంలో భారీ వర్షాల కారణంగా హరిహరపురం, బి.ఎన్.రెడ్డి నగర్, శ్రీపురం కాలనీ, గాంధీనగర్, గాంధీనగర్ సౌత్, రంగారెడ్డి కాలనీ, అఖిలాండేశ్వరి నగర్, స్నేహమయి నగర్, పీవీఆర్ కాలనీ, పద్మావతి నగర్, బ్యాంక్ కాలనీ, మైల్‌స్టోన్ తదితర కాలనీలతో పాటు గుర్రంగూడ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న పరిసర కాలనీలు వరద ముంపునకు గురవుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పైపులైన్ నిర్మాణం పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు వరద ముంపు సమస్య నుంచి ఉపశమనం లభించనుంది. ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం చొరవ చూపి నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన మధుయాష్కి గౌడ్ కి సాహెబ్ నగర్, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ల ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా... ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తాం! ఈ కార్యక్రమంలో బి.యన్ రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దు గౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్, సాహెబ్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కెతావత్ రమేష్ నాయక్,ఎస్ సి సెల్ చైర్మన్. భవాని సరస్వతి, సీనియర్ నాయకులు చంద్ర కాంత్ గౌడ్, శ్రీ.పాటి రాంబాబు గౌడ్,శంకర్ నాయక్ పారంద స్వామి,చిత్త రంజన్, రామకోటి నాయక్ పాల్గొనడం జరిగింది.

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి



మహేశ్వరం నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఆవుల యాదయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడు తూ.. పట్టభద్రుల సమస్యలను, నిరుద్యోగ యువతీ యువకుల సమ స్యలను శాసనమండలిలో సమర్థ వంతంగా వినిపించే నాయకుడిని ఎన్నుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.సమాజంలో ఓటు హక్కు ఎంతో కీలక మని, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకో వాలని సూచించారు.ఓటరు నమోదుకు ఓటరు గుర్తింపు కార్డు,ఆధార్ కార్డు, డిగ్రీ లేదా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజు ఫొటో,మొబైల్ నంబర్ అవసరమని తెలిపారు. అర్హులైన పట్టభద్రులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవడంతో పాటు తమ పరిసర ప్రాంతాల్లోని ఇతర పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు.రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరిం చేందుకు శాసనమ ండలిలో గళం వినిపించే సమర్థవంతమైన ఎమ్మెల్సీ అభ్యర్థిని ఎన్నుకోవాల్సిన బాధ్యత పట్టభద్రులపై ఉందని ఆవుల యాదయ్య పేర్కొన్నారు.

చిన్ననాటి జ్ఞాపకాల్లోకి తీసుకెళ్లే 'సమ్మర్ హాలిడేస్'.. ఘనంగా ప్రీ రిలీజ్ వేడుక

విభిన్నమైన కథలతో విజయాలు అందుకుంటున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని తన ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'సమ్మర్ హాలిడేస్'. శ్రీకర్ దర్శకత్వంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 6న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, హీరో కిరణ్ అబ్బవరం, దర్శకుడు బాబీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, "ఈ సినిమా చూస్తున్నప్పుడు పెద్దలు కూడా తమ బాల్యంలోకి వెళ్లిపోయి పిల్లల్లా మారి ఎంజాయ్ చేస్తారు. ఈతరం పిల్లలు చాలా టాలెంట్‌తో, కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. బిజీ లైఫ్‌లో మనం మర్చిపోయిన ఎన్నో జ్ఞాపకాలను, అమ్మమ్మ ఊరి అనుభూతులను ఈ సినిమా గుర్తు చేస్తుంది. ఇది చిన్న సినిమాగా అనిపించడం లేదు. నిర్మాత ధీరజ్ నమ్మకం నిజమై, ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి" అని ఆకాంక్షించారు.నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ, "ధీరజ్ నాతో కలిసి పనిచేశాడు. గీతా ఆర్ట్స్ లాగే క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా ఈ సినిమాను తీర్చిదిద్దాడని విన్నాను. ఇలాంటి మంచి చిత్రాలను కిరణ్ అబ్బవరం లాంటి హీరోలు సపోర్ట్ చేయడం అభినందనీయం. ఇది అందరికీ మంచి నోస్టాల్జిక్ అనుభూతినిస్తుంది" అని అన్నారు.

సహజనటి జయసుధ మాట్లాడుతూ, "ఇది పిల్లల సినిమా కాదు, ఇద్దరు చిన్న హీరోలు నటించిన సినిమా. వేసవి సెలవుల చుట్టూ అల్లుకున్న ఈ కథ అందరికీ కనెక్ట్ అవుతుంది. పెద్ద నిర్మాతలు కూడా ఇలాంటి చిన్న చిత్రాలను ప్రోత్సహించాలి" అని సూచించారు.

నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ, "ఇది పిల్లలు నటించిన పెద్దల సినిమా. ఈ చిత్రం చూశాక ప్రతి ఒక్కరూ తమ చిన్ననాటి స్నేహితులకు ఫోన్ చేస్తారు. కుటుంబమంతా కలిసి చూసేలా, మన జ్ఞాపకాలను గుర్తుచేసేలా ఉంటుంది" అని తెలిపారు. దర్శకుడు బాబీ మాట్లాడుతూ,

ఈ సినిమా వినోదంతో పాటు మంచి సందేశం ఇస్తుందని, పిల్లలతో సినిమా తీయడం అంత సులువు కాదని, దర్శకుడు శ్రీకర్‌ను అభినందించారు. దర్శకుడు శ్రీకర్ తన టీమ్‌కు, నటీనటులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ సినిమా కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో రాజీవ్ కనకాల, వాసుకి, మాస్టర్ అరుణ్, మాస్టర్ రోహన్ తదితరులు పాల్గొని చిత్ర విజయంపై ధీమా వ్యక్తం చేశారు.

'రామాయణ' సినిమాకు భారీ ఊరట

పైరసీపై బాంబే హైకోర్టు ఉక్కుపాదం



భారత సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న 'రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' చిత్రానికి బాంబే హైకోర్టులో భారీ ఊరట లభించింది. సినిమా విడుదలకు ముందే పైరసీ భూతం నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ నిర్మాతలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, సినిమాను అనధికారికంగా రికార్డ్ చేయడం, స్ట్రీమింగ్ చేయడం, లేదా ఏ ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో హోస్ట్ చేయడాన్ని నిషేధిస్తూ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చిత్రం ఈ నెల 5న విడుదల కానుంది. గాడ్ పవర్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. కాపీరైట్ హక్కుల ఉల్లంఘన జరగవచ్చనే బలమైన ఆందోళనతో వారు 'ఆనంద్ అండ్ నాయక్' న్యాయ సంస్థ ద్వారా కోర్టును ఆశ్రయించారు. సినిమా స్క్రిప్ట్, పాత్రలు, ఫుటేజ్, పాటలు, రికార్డింగ్‌లతో సహా అన్ని అంశాలపై తమకు పూర్తి హక్కులు ఉన్నాయని, వాటిని కాపాడాలని పిటిషన్‌లో కోరారు. కేవలం ఆహ్వానితుల కోసం ప్రదర్శించిన రెండు ట్రైలర్లను కొందరు రహస్యంగా రికార్డ్ చేసి డిజిటల్ నెట్ వర్క్‌లలో వ్యాప్తి చేశారని నిర్మాతలు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సినిమా మొదటి భాగాన్ని సుమారు రూ. 2,000 కోట్లతో, రెండు భాగాలను కలిపి మొత్తం రూ. 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తు న్నట్లు కోర్టుకు తెలిపారు. దీనిపై జస్టిస్ మాధవ్ జమ్దార్ నేతృత్వంలోని ధర్మాసనం స్పంది స్తూ.. "నిర్మా తలకు నిజమైన, బలమైన ఆందో ళన లు ఉన్నా యని ప్రాథమికంగా అర్థమవుతోంది" అని వ్యాఖ్యా నించింది. ఈ మేరకు గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థలు సినిమాను పైరసీ చేయకుండా 'డైనమిక్ ఇంజంక్షన్' ఉత్తర్వులు జారీ చేసింది. అభ్యంతరకర లింకులు లేదా మిర్రర్ సైట్లను తమ దృష్టికి తెచ్చిన వెంటనే వాటిని బ్లాక్ చేయాలని లేదా తొలగి ంచాలని ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు (ఐఎస్‌పీ), సోషల్ మీడియా సంస్థలను ఆదేశిం చింది.

బాలీవుడ్ నటుడు తుషార్ కపూర్‌కు బెదిరింపు కాల్.. రూ.5 కోట్ల డిమాండ్

బాలీవుడ్ నటుడు తుషార్ కపూర్‌కు రూ.5 కోట్ల కోసం బెదిరింపు కాల్ రావడం కలకలం రేపింది. తాను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడినంటూ ఓ ఆగంతుకుడు ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. అయితే, ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన ముంబై క్రైమ్ బ్రాంచ్, ఇది ఫేక్ కాల్ అయి ఉండవచ్చని అనుమానిస్తోంది. కాలర్ వాయిస్ శాంపిల్స్ మ్యాచ్ కాకపోవడమే ఈ అనుమానాలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. పోలీసు వర్గాల కథనం ప్రకారం.. తుషార్ కపూర్‌కు ఒక ఫోన్ కాల్ వచ్చింది. తాను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడైన 'హ్యారీ బాక్సర్' అని పరిచయం చేసుకున్న కాలర్, రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో అప్రమత్తమైన తుషార్ కపూర్ వెంటనే ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు, తక్షణమే విచారణను యాంటీ ఎక్స్టార్షన్ సెల్, క్రైమ్ బ్రాంచ్‌కు అప్పగించారు. విచారణలో భాగంగా క్రైమ్ బ్రాంచ్ టెక్నికల్ టీమ్, బెదిరింపు కాల్ ఆడియో రికార్డింగ్‌ను క్షుణ్ణంగా పరిశీలించింది. తమ వద్ద ఉన్న హ్యారీ బాక్సర్ అసలు వాయిస్ శాంపిల్స్‌తో దానిని పోల్చి చూసింది. అయితే, రెండు వాయిస్ శాంపిల్స్ మధ్య ఎలాంటి పోలిక లేదని సీనియర్ పోలీస్ వర్గాలు వెల్లడించాయి. ఇతర ఆడియో శాంపిల్స్‌తో పోల్చినా ఫలితం మారకపోవడంతో బిష్ణోయ్ గ్యాంగ్ పేరు చెప్పి నటుడిని భయపెట్టి డబ్బు గుంజడానికి ఎవరో ప్రయత్నించి ఉండవచ్చని పోలీసులు ఒక నిర్ధారణకు వస్తున్నారు. ఇటీవల నటుడు టైగర్ ష్రాఫ్‌ను లక్ష్యంగా చేసుకుని ముంబైలో జరిగిన కాల్పుల ఘటన తర్వాత ఈ బెదిరింపు కాల్ రావడం గమనార్హం. ఆ కాల్పులకు కూడా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వచ్చా యి. ఈ నేపథ్యంలోనే బాలీవుడ్‌లో భయాందోళనలు సృష్టించి, సులభ ంగా డబ్బు సంపాదించేందుకు కొందరు ఈ గ్యాంగ్ పేరును వాడు కుంటున్నారని పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ కేసులో పోలీ సులు ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ఫోన్ కాల్ చేసిన ఆగంతుకుడు ఎవరనేది గుర్తించేందుకు, కాల్ ఎక్కడి నుంచి వచ్చిందో ట్రేస్ చేసేందుకు ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తును ముమ్మరం చేసింది.



'ఓం' మూవీ నుంచి మరో క్రేజీ అప్డేట్ శ్రీలీల క్యారెక్టర్ ఇదే!

ధనుష్, మమ్ముట్టి వంటి స్టార్లు నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఓం' నుంచి మరో ఆసక్తికరమైన అప్డేట్ వచ్చింది. ఈ సినిమాలో నటిస్తున్న శ్రీలీల పాత్రను, ఆమె లుక్‌ను చిత్ర బృందం మంగళవారం అధికారికంగా వెల్లడించింది. ఇందులో శ్రీలీల 'రోజా' అనే పాత్రలో కనిపించనున్నట్లు నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిల్మ్స్ ప్రకటించింది. దీనికి సంబంధించిన 'సెంజుదరే' అనే పాటలోని చిన్న వీడియోను పంచుకుంటూ, ఈ పూర్తి పాట బుధవారం విడుదల కానుందని తెలిపింది.ఇటీవల ఈ సినిమాలోని మరో హీరోయిన్ సాయి పల్లవి పాత్రను కూడా మేకర్స్ పరిచయం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో సాయి పల్లవి 'నిత్య రెడ్డి' అనే ఐపీఎస్ అధికారిణి పాత్రలో నటిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ఈ అధికారిణి, ఆ తర్వాత సీబీఐకి బదిలీపై వెళ్లి 'ఆపరేషన్ ఓం'ను నడిపించే కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్రను తనకు ఇచ్చినందుకు సాయి పల్లవి దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామికి ధన్యవాదాలు తెలిపారు. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తొలిసారిగా ధనుష్, మమ్ముట్టి కలిసి నటిస్తుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి 'కార్తికేయన్' అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తుండగా, ధనుష్ ఎర్రచందనం కూలీగా కనిపించనున్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో సాగే ఈ కథలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని టైటిల్ టీజర్ స్పష్టం చేసింది.ఈ చిత్రాన్ని నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. వాస్తవానికి అక్టోబర్ 16న విడుదల చేయాలని భావించినా, రజినీకాంత్ 'జైలర్ 2' సినిమాకు గౌరవంగా వాయిదా వేశారు. ధనుష్ కెరీర్‌లోనే భారీ బడ్జెట్ చిత్రాల్లో ఒకటిగా నిలుస్తున్న ఈ సినిమాలో ప్రముఖ బాలీవుడ్ నటుడు నసీరుద్దీన్ షా కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. 'ఓం: చాప్టర్ 1' అనే టైటిల్ చూస్తుంటే, ఈ సినిమాకు సీక్వెల్ కూడా ఉండే అవకాశం కనిపిస్తోంది. సాయి అభ్యంక్కర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.



రష్మిక హిందీ యాసపై విమర్శలు అండగా నిలిచిన బాలీవుడ్ నటి



బాలీవుడ్‌లో పనిచేసే దక్షిణాది నటీనటులు వారి హిందీ యాస (యాక్సెంట్) కారణంగా తరచుగా విమర్శలు, ట్రోలింగ్ ఎదుర్కోవడంపై యువ నటి కషికా కపూర్ స్పందించారు. నటులను వారి నటన ఆధారంగా చూడాలని, భాష లేదా యాస ఎప్పటికీ అడ్డంకి కాకూడదని ఆమె అభిప్రాయపడ్డారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. "హిందీ చిత్రాల్లో పనిచేసే దక్షిణాది నటుల యాసపై విమర్శలు వస్తుంటాయి, దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?" అని అడగగా, కషికా బదులిస్తూ.. "ఇలా జరగడం చూస్తూనే ఉన్నాం. కానీ ఒక నటుడిని/నటిని అంతిమంగా నటన ఆధారంగానే గుర్తించాలి. భాష అనేది ఎప్పటికీ అవరోధం కాకూడదు. ఇది తెలుగు చిత్ర పరిశ్రమ, ఇది హిందీ చిత్ర పరిశ్రమ అని మనం విడదీయకూడదు" అని స్పష్టం చేశారు. గతంలో 'కాఫీ విత్ కరణ్' షోలో నటి రష్మిక మందన్న కూడా తన కెరీర్‌లో యాస విషయంలో ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నానని వెల్లడించిన సంగతి తెలిసిందే. దక్షిణాదికి చెందిన దానిని కావడం వల్ల తన హిందీ యాస సహజంగానే అలా వస్తుందని, అయినా ఆ విమర్శలకు భయపడి తాను వేర్వేరు భాషల్లో పనిచేయడం ఆపనని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో రష్మిక ఉదాహరణను ప్రస్తావిస్తూ కషికా మాట్లాడారు. "ఉదాహరణకు రష్మిక మందన్నను తీసుకోండి. ఆమె ఒక అద్భుతమైన నటి, పెర్ఫార్మర్. ఆమెను యాస లేదా భాష ఆధారంగా జడ్జ్ చేయడం సరైంది కాదు. అది ఆమె గుర్తింపులో ఒక భాగం. ఆమె మూలాలు అక్కడివి. 'యానిమల్' లాంటి భారీ చిత్రాల్లో నటించి గొప్ప పనితీరు కనబరిచారు. నటులను వారి యాసను బట్టి కాకుండా, వారి ప్రతిభను చూసి అభినం దించాలి" అని కషికా కపూర్ తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com